## నరాల్లోకి హార్పిక్!.. ఇంజెక్షన్ ఇచ్చి భర్త హత్య..



### గల్ఫ్ నుంచి వచ్చిన మూడ్రోజులకే ఘోరం!

**హైదరాబాద్, జూలై 07 :** ప్రియుడి మోజులో పడిన ఓ ఇల్లాలు భర్తను దారుణంగా హతమార్చింది. గల్ఫ్ నుంచి వచ్చిన మూడ్రోజులకే బంగ్లా పైనుంచి తోసేసింది. గాయాలతో బయటపడి దవాఖానలో చేరిన భర్తను కిరాతకంగా అంతమొందించింది. సెలైన్‌లో టాయిలెట్ క్లీనర్ కలిపి ఎక్కించడంతో అతడు చనిపోయాడు. నిజామాబాద్ జిల్లాలో చోటుచేసుకున్న ఈ దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిజామాబాద్ సౌత్ రూరల్ సీఐ సురేశ్‌కుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మోపాల్ మండలం న్యాల్‌కల్‌కు చెందిన ప్రశాంత్ (35), సంధ్య దంపతులు. కుటుంబ పోషణ నిమిత్తం ప్రశాంత్ కొన్నేండ్లుగా దుబాయ్‌కి వెళ్లి వస్తున్నాడు. నిజామాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానలో నర్సుగా పని చేసే సంధ్యకు అనిల్‌తో పరిచయం ఏర్పడింది. ఇది కాస్త వివాహేతర సంబంధానికి దారితీసింది. రెండేండ్ల తర్వాత ప్రశాంత్ గత నెల 27న దుబాయ్ నుంచి తిరిగి వచ్చాడు.అనిల్‌తో తన సంబంధాన్ని కొనసాగించేందుకు భర్తను అడ్డు తొలగించుకోవాలని సంధ్య పథకం వేసింది. తనకు పరిచయమున్న న్యాల్‌కల్ వాసిబంటితో పథకం రచించింది. జూన్ 29న ప్రశాంత్, బంటి కలిసి తమ ఇంటి దాబాపై మద్యం తాగేలా ఏర్పాట్లు చేసింది. ఫుల్లుగా మద్యం తాగిన భర్తను సంధ్య, బంటి కలిసి దాబా పైనుంచి కిందికి తోసేశారు. కానీ ప్రశాంత్ గాయాలతో బయట పడటంతో ప్రైవేట్ దవాఖానలో చికిత్స చేయించారు. ఇంటికి వచ్చిన భర్త ఎక్కడ కోలుకుంటాడోనని భావించిన సంధ్య.. అడ్డు తొలిగించుకునేందుకు ఇదే సరైన సమయమని భావించింది. అతని చేతికి ఉన్న సెలైన్ క్యాన్ ద్వారా టాయిలెట్ క్లీనర్‌ను ఎక్కించింది. దీంతో పరిస్థితి విషమించి ప్రశాంత్ కన్నుమూశాడు. ప్రశాంత్మృతికి కోడలు సంధ్యతోపాటు మరో వ్యక్తిపై అనుమానం వ్యక్తంచేస్తూ తల్లి జూన్ 30న పోలీసు లను ఆశ్రయించింది. అనుమానాస్పద మృతి గా కేసు నమోదు చేసిన పోలీసులు.. సంధ్య, బంటిని అదుపులోకి తీసుకుని విచారించగా తామే హత్య చేసి నట్టు అంగీకరించారు. దీంతో వారిద్దరితోపాటు అని ల్‌ను అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు.

## కుడాలో అవినీతికి పాల్పడిన కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

### దాస్యం వినయ్ భాస్కర్



**హైదరాబాద్, జూలై 07 :** హెచ్‌సీయూ తరహాలో భద్రకాళి చెరువుపై కన్నేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి చెరువుని కబ్జా చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఆరోపించారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కుడాలో (కాకతీయ డెవలప్‌మెంట్ అథారిటీ) రాజేందర్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి అవినీతికి పాల్పడ్డారన్నారు.తెలంగాణ రెండో రాజధాని అయిన వరంగల్‌లో గజం స్థలం రూ.1.50 లక్షలు ఉంటే జూన్ 21 నాడు నాయిని రాజేందర్ రెడ్డి కొందరితో సిండికేట్ అయి కుడా వేలంపాటలో రూ.60 వేలకే తీసుకున్నాడు. ప్రపంచమంతా ఆన్‌లైన్ టెండర్లు నడుస్తుండగా కుడాలో మాత్రం ఆఫ్‌లైన్ టెండర్లు వేస్తున్నారని మండిపడ్డారు. 2.27 ఎకరాల స్థలాన్ని కుడా కార్యాలయంలో నాలుగు గోడల మధ్య వాళ్లే నలుగురు కూర్చొని వేలంపాట పాడి సుమారు రూ.70 కోట్లు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు.

## దేశవ్యాప్తంగా 58 ఇంజనీరింగ్ కాలేజీల మూసివేత..

### 2025-26లోనే అడ్మిషన్లు నిలిపివేత..



**హైదరాబాద్, జూలై 07 :** దేశవ్యాప్తంగా గత ఏడాది 58 ఇంజనీరింగ్ కాలేజీలను యాజమాన్యాలు మూసేశాయి. దీనికి సంబంధించి ఆయా కాలేజీలకు ప్రభుత్వం కూడా అనుమతించింది. ఈ విషయాన్ని ఏఐసీటీఈ (ది ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) తాజాగా వెల్లడించింది. ఏఐసీటీఈ అనుమతితో 2025-26లో దేశ వ్యాప్తంగా 58 ఇంజనీరింగ్ కాలేజీలు మూసి వేశారు. ఈ 58 కాలేజీల్లో మూడు ప్రభుత్వ ఎయిడెడ్ కాలేజీలుకాగా, మిగతావి ప్రైవేటు కాలేజీలు. కాలేజీల మూసివేతకు యాజమాన్యాలు చేసుకున్న దరఖాస్తులతో ఈ అనుమతి లభించింది. దీని ప్రకారం ఈ 58 కాలేజీలు 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఫస్ట్ ఇయర్‌లో కొత్త అడ్మిషన్లు తీసుకోలేదు. కానీ, అప్పటికే కొనసాగుతున్న విద్యార్థులకు సంబంధించి వారి అకమిక్ కోర్సులు పూర్తయ్యే వరకు కాలేజీలు కొనసాగుతాయి. అంటే, సెకండియర్, థర్డ్ లేదా ఫైనలియర్ చదువుతున్న విద్యార్థుల పూర్తి కోర్సు పూర్తయ్యే వరకు కాలేజీలు పని చేస్తాయి. ఈ విషయంలో విద్యార్థుల భద్రతకు, భవిష్యత్తుకు ఆయా కాలేజీలు గ్యారెంటీ ఇవ్వాల్సిందే. అవసరమైతే విద్యార్థుల్ని మరో కాలేజీకి బదిలీ చేస్తారు. ఈ విషయంలో ఏఐసీటీఈ వారికి అండగా ఉంటుంది. ఆయా కాలేజీల్లో కోర్సులు పూర్తయ్యేలా చూస్తుంది. కొంతకాలంగా కాలేజీల్లో సరైన అడ్మిషన్లు లేకపోవడం, అలాగే, ప్రస్తుతం అకడమిక్ ప్రమాణాలు, మౌలిక వసతుల ప్రమాణాలకు అనుగుణంగా కాలేజీలు నిర్వహించలేనందున వాటిని మూసేస్తున్నట్లు ఆయా కాలేజీల యాజమాన్యాలు తమ అభ్యర్థనల్లో పేర్కొన్నాయి. ఈ ప్రక్రియను ఏఐసీటీఈ.. ప్రగతిశీల మూసివేతగా పేర్కొంది. మరోవైపు 2025-26 విద్యా సంవత్సరంలో దేశవ్యాప్తంగా 950కిపైగా టెక్నికల్, ఇంజనీరింగ్ కోర్సులు రద్దయ్యాయి. విద్యార్థులు వీటిపై ఆసక్తి చూపక పోవడం, ప్రాధాన్యతలు మారడం, సరైన సిబ్బంది లేకపోవడం, మౌలిక వసతులు అందుబాటులో లేకపోవడం వంటి కారణాల వల్ల అనేక కోర్సులు ఆగిపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా మూసివేతకు గురైన కాలేజీల వివరాలివి. యూపీలో 12, మహారాష్ట్రలో 12, మధ్యప్రదేశ్‌లో 8, తెలంగాణలో 4, పంజాబ్‌లో 4, ఏపీలో 3, రాజస్థాన్‌లో 3, గుజరాత్, కర్ణాటక, తమిళనాడు, హరియాణా, ఒడిశా, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్‌లలో 2 చొప్పున కాలేజీలు, పుదుచ్చేరిలో ఒక కాలేజీని మూసివేశారు. ప్రతి ఏడాది ఇలా పలు కాలేజీలు దేశవ్యాప్తంగా మూసివేతకు గురవుతాయి. ఇక, ఈ ఏడాది ఎన్ని కాలేజీలు ఇలా మూసేయడానికి అనుమతి పొందుతాయో చూడాలి.

## వామ్మో ఆ డీఎస్పీ భీం రెడ్డి ఆస్తులు 300 కోట్లు పైమాటే!



**హైదరాబాద్, జూలై 07 :** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో హైదరాబాద్ లోని పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ విభాగంలో డీఎస్పీ గా చేస్తున్న భీం రెడ్డిని అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. సోదాల సమయంలో ఆయన అనారోగ్యానికి గురి కావటంతో ఆయనను ఆసుపత్రికి తరలించారు. ఆయన కోలుకుని డిశ్చార్జ్ అయిన వెంటనే అధికారులు ఆయనను అదుపులోకి తీసుకొని ఏసిబీ ఆఫీసుకు తరలించారు. జడ్జి ముందు హాజరు పరచగా, మెజిస్ట్రేట్ ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించడంతో చంచల్ గూడా జైలుకు తరలించారు. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నాడన్న సమాచారంతో ఏసీబీ అధికారులు డీఎస్పీ భీం రెడ్డి, ఆయన బంధువులు, బినామీలకు చెందిన 16 ప్రాంతాలలో ఏసీబీ అధికారులు ఏకకాలంలో జరిపిన సోదాలలో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆయన మొత్తం ఆస్తుల విలువ సుమారు 300 కోట్లకు పై మాటే అని ఏసీబీ అధికారులు గుర్తించారు. ఆయన ఇళ్ళు, ఆస్తులపై ఏకకాలంలో జరిపిన తనిఖీలలో ఆయన దగ్గర 2 కిలోల బంగారం, 20 కిలోల వెండి , 43.6 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు. అంతేకాదు 23 విదేశీ మద్యం బాటిల్స్ కూడా లభించాయి. ఇది మాత్రమే కాక ఆయనకు హైదరాబాద్లోని గచ్చిబౌలి, మణికొండ, టెలికాం నగర్ ప్రాంతాలలో ఓపెన్ ప్లాట్లు, ఇబ్రహీం బాగ్ లో ఒక లగ్జరీ విల్లా ఉన్నాయి. వీటితోపాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో వందల ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. అంతేకాదు ఆయన ఇంట్లో తనిఖీలు చేస్తున్న సమయంలో భీం రెడ్డి ఇంట్లో ఒక రహస్య డైరీని కూడా గుర్తించి, అందులో ఉన్న వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

## ఆయిల్‌పామ్ రైతులతో ముచ్చటించిన కేటీఆర్



**హైదరాబాద్, జూలై 07 :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేపాక గ్రామంలో ఆయిల్‌పామ్ రైతులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం ఉదయం ముచ్చటించారు. వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.బీఆర్ఎస్ హయాంలో ఉద్యమంలా సాగిన ఆయిల్‌పామ్ సాగు, కాంగ్రెస్ పాలనలో కుంటుపడింది. ఆయిల్‌పామ్ సాగును విస్తృతంగా ప్రోత్సహించేందుకు బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన కార్యక్రమాలను రేవంత్ సర్కార్ నిర్వీర్యం చేసింది. వంట నూనెల దిగుమతి తగ్గించాలనే ఉద్దేశంతో, 20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యంగా ఆనాడు కేసీఆర్ ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంది.సాగునీటి విస్తీర్ణం పెంచి.. ప్రోత్సాహకాలు, రాయితీలు అందించి.. ఇండోనేషియా, మలేషియా నుండి అధునాతన టెక్నాలజీ, అత్యుత్తమ విత్తనాలు తెచ్చి.. 46,000 ఎకరాల్లో ఉన్న ఆయిల్‌పామ్ సాగును రికార్డు స్థాయిలో 1.5 లక్షల ఎకరాల్లో విస్తరించింది.కేసీఆర్ హయాంలో ప్రణాళికలు రూపొందించిన 30ఆయిల్‌పామ్ మిల్లులను, ఇతర కార్య క్రమాలను ముందుకు తీసుకెళ్లకుండా ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగును పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నది.

## తెలంగాణ కాంగ్రెస్‌లో మరో అలజడి



**హైదరాబాద్, జూలై 07 :** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటాలు తార స్థాయికి చేరుకుంటున్నాయి. మొన్నటికి మొన్న సీఎం రేవంత్ రెడ్డిపై నలుగు మంత్రులు తిరుగుబాటు ఆ పార్టీలో తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. తాజా మంత్రి కొండా సురేఖకు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య మరోసారి విభేదాలు భగ్గుమన్నాయి. మంత్రి సురేఖకు తెలియకుండానే కడియం శ్రీహరి స్టేషన్‌ఘన్‌పూర్ పరిధిలోని ఆలయాల పరిస్థితులపై హైదరాబాద్‌లో దేవాదాయ శాఖ కమిషనర్‌తో ఎండోమెంట్ రివ్యూ నిర్వహించారు.దేవదాయ శాఖ మంత్రినైన తనకే తెలియకుండా కడియం శ్రీహరి రివ్యూ చేయడంపై మంత్రి కొండా సురేఖ తీవ్ర తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కడియంపై స్టేట్ కమాండ్‌కి కాకుండా నేరుగా ఏఐసీసీకి ఫిర్యాదు చేశారు. దీంతో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అవాక్కయ్యారు. తనకు చెప్పకుండా హైకమాండ్‌కి మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు చేయడంపై ఆరా తీశారు.హైకమాండ్‌కు రాసిన లేఖను బహిర్గత పరచొద్దని మంత్రి కొండా సురేఖకు మహేష్ కుమార్ గౌడ్ సూచించినట్లు సమాచారం. కాగా, గతంలో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో హైకమాండ్ వారి మధ్య సయోధ్య కుదిర్చే ప్రయత్నం చేసింది. ఇంతలోనే మళ్లీ మంత్రి హైకమాండ్‌కు ఫిర్యాదు చేయడంతో రాష్ట్ర కాంగ్రెస్ నేతలు తలలు పట్టుకుంటున్నారు.

## కన్నెపల్లి పంప్ హౌస్‌ను తక్షణమే ప్రారంభించాలి



### లేదంటే రైతాంగాన్ని ఏకం చేస్తాం..!

### బీఆర్ఎస్వీ నాయకులు

**హైదరాబాద్, జూలై 07 :** కన్నెపల్లి పంప్‌హౌస్‌ను తక్షణమే ప్రారంభించి.. ఎండిపోతున్న ఆయకట్టుకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను విడుదల చేయాలని రైతులు, బీఆర్ఎస్వీ నాయకులు డిమాండ్ చేశారు. సూర్యాపేట కలెక్టరేట్ కార్యాలయం వద్ద మంగళవారం రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు భారీ ఆందోళన నిర్వహించాయి. రైతులు కలెక్టరేట్ ముందు బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ధర్నా సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు నెమ్మాది శ్రావణ్ కుమార్, ముఖ్య నాయకులు మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో కరువు ప్రమాదం పొంచి ఉందని, వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ప్రతి ఏటా సకాలంలో నీరందించి రైతాంగాన్ని ఆదుకున్నామని వారు గుర్తు చేశారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం కేవలం రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే కన్నెపల్లి పంప్ హౌస్ పునరుద్ధరణను నిర్లక్ష్యం చేస్తోందని, బీఆర్ఎస్‌కు పేరు వస్తుందనే ఉద్దేశంతోనే కాళేశ్వరం జలాలను ఆపాలని కుట్ర పన్నుతోందని బీఆర్ఎస్వీ నాయకులు ఆరోపించారు. రైతుల పొలాలు ఎండిపోతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని బీఆర్ఎస్వీ నాయకులు మండిపడ్డారు. కన్నెపల్లి పంప్ హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోయడానికి అన్ని అవకాశాలు ఉన్నప్పటికీ కాంగ్రెస్ సర్కార్ కావాలనే కాలయాపన చేస్తూ రైతుల పొట్ట కొడుతోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కన్నెపల్లి పంప్ హౌస్‌ను యుద్ధప్రాతిపదికన ప్రారంభించి ఆయకట్టుకు నీరు విడుదల చేయాలని, సాగునీటి విషయంలో రాజకీయం పక్కనబెట్టి, రైతుల ప్రయోజనాలే పరమావధిగా ప్రభుత్వం పనిచేయాలని వారు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ముట్టడి అనంతరం బీఆర్ఎస్ నాయకులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.

## 'సర్' ప్రక్రియ పురోగతిని పరిశీలన



**హైదరాబాద్, జూలై 07:** సర్ కార్యక్రమంలో భాగంగా అడిషనల్ సీఈవో వాసం వెంకటేశ్వర్లు రెడ్డి (ఐఏఎస్) మంగళవారం మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి, మీర్ పేట్, ఎల్.బి.నగర్ నియోజక వర్గంలోని సరూర్ నగర్ ప్రాంతాలలో పర్యటించి 'సర్' ప్రక్రియ పురోగతిని పరిశీలించారు.సర్ కార్యక్రమంలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని బీఎల్‌వో (BLO)లను, సూపర్‌వైజర్లను ఆదేశించారు. ఎన్యూమరేషన్ ఫారం నింపడంలో సూపర్‌వైజర్లు ముఖ్య పాత్ర పోషించాల న్నారు. ఫారాలు నింపడంలో బీఎల్‌వోలకు సహకరించాలన్నారు. అవసరమైన చోట్ల వాలంటీర్ల సేవలను వాడుకొని ఎన్యుమరేషన్ ఫారాలు తప్పులు లేకుండా నింపడంలో ఓటర్లకు సహకరించాలని సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలను ఆదేశించారు.ఎన్యూమరేషన్ ఫారంలో ఓటరు సంతకంతోపాటు ఫోటో ఉండేలా చూడాలని బీఎల్‌వోలను ఆదేశించారు. పర్యటనలో భాగంగా వాసం వెంకటేశ్వర్లు రెడ్డి జల్‌పల్లిలో 32 చోట్ల రోహింగ్యాలు నివసిస్తున్న ప్రాంతాలను పర్యటించి వారిని గుర్తించారు. ఈ పర్యటనలో ERO, BLOలు తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక మరో రిటైర్డ్ టీచర్ ఆత్మహత్య



**జనగామ, జూలై 07 :** కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి మరో విశ్రాంత ఉపాధ్యాయుడు మృతి చెందాడు. ఈ విషాదకర సంఘటన జనగామ జిల్లా కేంద్రంలోని పూర్ణిమ కాలనీలో చోటు చేసుకుంది. రిటైర్డ్ టీచర్ పగిడిపల్లి మల్లయ్యకు పదవీ విరమణ ప్రయోజనాలు సకాలంలో అందకపోవడం, ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.తనకు రావాల్సిన 10,77,528 రూపాయలను 21 నెలలు గడిచినా ప్రభుత్వం చెల్లించలేదు. అలాగే పలువురు బంధువులు కూడా తీసుకున్న అప్పులు తిరిగి ఇవ్వకపోవడం, తను తీసుకున్న అప్పులకు వడ్డీలు కట్టలేక, వారి వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు సుమారు 20 పేజీల సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

## జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలి

- 10న రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ అధికారులకు వినతులు



**హైదరాబాద్, జూలై 07:** రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని కోరుతూ ఈనెల 10వ తేదీన "జర్నలిస్టుల వినతులు"అనే కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, తన్నీరు శ్రీనివాస్ లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఆర్టీసీ బస్ చార్జీల్లో 1/3 వంతు రాయితీ కల్పించినప్పటికి ఆర్టీసీ సంస్థ మాత్రం దాదాపు 50 శాతం చార్జీలు వసూలు చేస్తున్నారని, దీనివల్ల నిత్యం వార్తా సేకరణకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే జర్నలిస్టులకు భారమవుతుందని అన్నారు. ప్రభుత్వం చాలా ఏళ్ళుగా జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో 1/3 రాయితీ పై ప్రయాణ సదుపాయం అమలు చేస్తుందని, అయితే ఇటీవల కాలంలో టోల్ ఫీజు, సర్వీస్ చార్జి పేరుతో మూడోవంతు చార్జీలను 50 శాతానికి పెంచారని తెలిపారు. పేరుకే 1/3 చార్జీలని, కానీ 50% చార్జీలు వసూలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో అనేక మంది జర్నలిస్టులు సరైన వేతనాలు లేకపోయినప్పటికి జర్నలిజం వృత్తిలో కొనసాగుతూ ప్రభుత్వానికి, ప్రజలకు, ఆర్టీసీ సంస్థకు సేవలందిస్తున్నారని, అటువంటి జర్నలిస్టులు వార్తల సేకరణ కోసం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాల్సి వస్తుందని, ఫలితంగా ఆర్టీసీ ప్రయాణ చార్జీల భారం విపరీతంగా పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన ప్రభుత్వం, ఆర్టీసీ సంస్థ...కొద్ది సంఖ్యలో ఉన్న జర్నలిస్టులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించకపోవడం బాధాకరమన్నారు. జర్నలిస్టులకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడం వల్ల ప్రభుత్వానికి, ఆర్టీసీ సంస్థకు పెద్ద ఆర్థిక భారమేమీ పడదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జర్నలిస్టులకు అన్ని అర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని వారు కోరారు.ఈ నెల 10వ తేదీన రాష్ట్ర రవాణా శాఖ మంత్రితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ అధికారులకు అనగా ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, రీజినల్ మేనేజర్లు, డివిజనల్ మేనేజర్లు డిపో మేనేజర్లకు వినతి పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

బలగం TV BALAGAM
balagamtv100@gmail.com

# (మొదటిపేజీ తరువాయి)

## సాంకేతికతలో తెలంగాణ పోలీసులు బెస్ట్

**ఖమ్మం, జూలై 7:** దేశంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడంలో తెలంగాణ పోలీసులు ముందు వరుసలో ఉన్నారని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ ప్రజలకు మాత్రమేనని..నేరస్తులకు కాదని స్పష్టం చేశారు. ఖమ్మం నగరంలో మంగళవారం పర్యటించిన డీజీపీ.. మీడియాతో మాట్లాడారు. తెలంగాణ సరిహద్దులో గంజాయికి వ్యతిరేకంగా మావోయిస్టులు పనిచేశారని గుర్తుచేశారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల నియంత్రణ ప్రధాన లక్ష్యంగా పోలీసు వ్యవస్థ పనిచేస్తున్నదని చెప్పారు. పలు రాష్ట్రాలకు ఎంట్రీ పాయింట్‌గా ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉన్నందున ఇక్కడి నుంచే మాదకద్రవ్యాల నియంత్రణ ప్రారంభం కావాల్సిన అవసరం ఉన్నదన్నారు. నేరాల నియంత్రణలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ని ఉపయోగించుకుంటామని తెలిపారు. ఖమ్మం జిల్లాలో రూ.11 కోట్ల దోపిడీ జరిగిందని, సైబర్ క్రైమ్‌లో రూ.42 కోట్లు పోగొట్టుకున్నారని వివరించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. సామినేని రామారావు హత్యకేసు విచారణ నెలరోజుల్లో పూర్తి చేయాలని సీపీని ఆదేశించారు. రాష్ట్రంలో మావోయిస్టులపై నిఘా కొనసాగుతున్నదని, లొంగిపోయినవారి కదలికపై దృష్టి సారించామ ని చెప్పారు. సమావేశంలో ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, ఈగల్ ఫోర్స్ ఎస్పీ గిరిధర్, సీపీ సునీల్‌దత్, ఏసీపీ వసుంధర పాల్గొన్నారు.

## సింగరేణిపై బీజేపీ,కాంగ్రెస్ కొత్త నాటకం

### మాజీ మంత్రి కొప్పల ఈశ్వర్

**హైదరాబాద్, జూలై 07 :** తాడిచర్ల బ్లాక్ 2ను సింగరేణికి కేటాయించామంటూ బీజేపీ, కాంగ్రెస్ కొత్త నాటకానికి తెర తీశాయని మాజీ మంత్రి, టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. సింగరేణిలో అక్రమాల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలను కాపాడేందుకే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తాడిచర్ల ప్రకటన చేశారనే అనుమానాలు కలుగుతున్నాయని పేర్కొన్నారు. గనులను టెండర్ల ద్వారా ప్రైవేట్ సంస్థలకు అప్పగించే దుర్మార్గానికి తెరతీసిన పాపం కాంగ్రెస్, బీజేపీలదేనని ధ్వజమెత్తారు. 'బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొంటేనే గనులు దకుతాయని సీఎం రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార పదేపదే చెప్పారు. కేంద్ర మంత్రులు కూడా ఇదే ప్రచారం చేశారు. కానీ, వేలం లేకుండా సింగరేణి అనుభవం ఆధారంగా గనులు కేటాయించాలని నిరంతరం పోరాడింది బీఆర్ఎస్, టీబీజీకేఎస్ మాత్రమే' అని స్పష్టంచేశారు. బొగ్గు గనులపై, జీఎం కార్యాలయా ల ఎదుట నల్లబ్యాడ్జీలతో తాము చేసిన పోరాటాల ఫలితంగానే నేడు కేంద్రం దిగివచ్చి తాడిచర్ల బ్లాక్‌ను కేటాయించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. తాడిచర్ల బ్లాక్-2 మాత్రమే కాకుండా.. తెలంగాణలోని మిగిలిన అన్ని బొగ్గు బ్లాక్‌లను వేలం లేకుండా సింగరేణి సంస్థకే కేటాయించాలని కార్మికుల పక్షాన డిమాండ్ చేశారు.

## వయనాడ్‌లో బీభత్సం..



తలెత్తుతున్నాయి. ఇండ్లకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు. పోలీసులతోపాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో పాల్గంటున్నాయి.

## డిజిటల్ గవర్నెన్స్‌తో పారదర్శక పాలన

ముఖ్యమంత్రి సూచించారు. ఈ కమిటీ 100 రోజుల్లో నివేదిక సమర్పించి ఈ అంశాన్ని ఒక కొలిక్కి తీసుకురావాలని ఆదేశించారు. హెల్త్ కార్డులు, ఇతర బెనిఫిట్స్ అమలు చేసేందుకు ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను కూడా డిజిటలైజ్ చేయాలని సూచించారు. నిరంతరం మానిటరింగ్ చేసేందుకు ఆర్థిక శాఖ విభాగం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఎంసీఆర్ హెచ్ఆర్డీ వైస్ ఛైర్మన్ శాంతి కుమారి తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



విద్యను అభ్యసిస్తున్న పేద, మధ్య తరగతికి చెందిన విద్యార్థులు ఆర్థిక భారంతో కొందరు విద్యకు దూరం కాగా మరికొందరు పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేస్తూ విద్యను అభ్యసిస్తున్నారని ఆవే దన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారం అవుతుందని ఆరోపించారు. ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగా టం అడుకోకుండా తక్షణమే ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను మొత్తం విడదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మచ్చె శ్రీనివాస్, సదుల శేఖర్, బల్యాల ప్రవీన్, బక్కని వేణుయాదవ్, దడికే రాజు, రాజేష్, ఆదిల్, యశ్వంత్, ఆమన్, వంశీ, లోకేష్, జుమీర్ పాల్గొన్నారు.

## టీఆర్ఎస్ పేరు పై ఈసీ నిర్ణయం వేళ హైకోర్టు కీలక ఆదేశాలు..!!



వస్తున్నాయి. దీంతో, ఈ పేరు కొనసాగింపు పైన ఎన్నికల సంఘం కవితకు లేఖ రాసి ంది. అభ్యంతరాలు పెద్ద సంఖ్య లో రావటంతో.. ఈ పేరు కొనసాగిం చలేమని స్పష్టం చేసింది. ప్రత్యామ్నా యంగా ఇతర పేర్లు ఎంపిక చేయా లని సూచించింది. కవిత తమ పార్టీ పేరు ఖరారు సమయంలోనే ప్రకటన ఇచ్చామని.. అప్పుడు వచ్చిన అభ్యం తరాలకు సమాధానం కూడా ఇచ్చామని గుర్తు చేస్తున్నారు. ఈసీకి వచ్చిన అభ్యంతరాల పైన స్పష్టత ఇస్తే సమాధానాలు ఇస్తామని పేర్కొన్నారు. ఇదే అంశం పైన కవిత తాజాగా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటీషన్ పైన కోర్టు స్పందించింది. తాము ఈ పిటీషన్ విచారణకు స్వీక రిస్తే ఎన్నికల సంఘం విధుల్లో జోక్యం చేసుకోవటమేనని పేర్కొంది. ఇదే సమయంలో టీఆర్ఎస్ రిజిస్ట్రేషన్‌పై తీవ్రమైన అభ్యంతరాలు వచ్చిన అం శాన్ని కోర్టు గుర్తు చేసింది. కాగా.. అభ్యం తరాలు తమకు ఇవ్వలేదని.. వ్యక్తిగత వాద నలకు అవకాశం ఇవ్వాలని కవిత తరపు న్యాయవాదులు కోరారు. అయితే, తాము నిబంధనల ప్రకారమే వ్యవహరిస్తున్నామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. టీఆర్ఎస్ అనేది ఒకే పేరుగా కనిపిస్తుందని ప్రత్యా మ్నాయ పేర్లు ఇవ్వాలని, తెలంగాణ రక్షణ సమితి పేరు టీఆర్ఎస్‌కు అర్థం వచ్చేలా ఉందని హైకోర్టు పేర్కొంది. ఈసీ నోటీసు లకు జవాబిచ్చేందుకు కవితకు వారం రోజుల గడువు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈసీ లేవనెత్తిన అభ్యంతరాలకు సమాధానం చెప్పాలని, ఈసీకి సమాధానాలు చెప్పాకే కోర్టుకు రావాలని కవితకు న్యాయస్థానం సూచన చేసినట్లు సమాచారం.

## రోడ్డు దాటుతుండగా బుల్లెట్ బైక్ ఢీకొని వ్యక్తి మృతి



### డ్రైవర్‌పై కేసు నమోదు

**హైదరాబాద్, జూలై 07 :** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పెద్ద తూప్రా గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన విషాదాన్ని నింపింది. గ్రామానికి చెందిన డి. శ్రీనివాస్ (49) రోడ్డు దాటుతుండగా అతివేగంగా వచ్చిన బుల్లెట్ మోటార్‌సైకిల్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. జూలై 6వ తేదీ రాత్రి శ్రీనివాస్ గ్రామంలోని బంధువుల ఇంట్లో జరిగిన కుటుంబ కార్యక్రమానికి హాజరై తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో పెద్ద తూప్రా గ్రామ కమాన్ సమీపంలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద రోడ్డు దాటుతుండగా, తిమ్మాపూర్ నుంచి మహేశ్వరం వైపు వస్తున్న బుల్లెట్ బైక్ (నంబర్: TS07 JV 9142) అతడిని బలంగా ఢీకొట్టింది. బైక్‌ను భానూరి విజ య్ (28) అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపడంతో ప్రమాదం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఢీకొట్టిన ప్రభావానికి శ్రీనివాస్ గాల్లోకి ఎగిరి రోడ్డుపై పడటంతో తలకు, కడుపు భాగానికి తీవ్ర గాయాల య్యాయి. స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం లి మ్స్ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతరం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి రెఫర్ చేశారు. గాంధీ ఆస్పత్రిలో వైద్యులు అత్యవసర చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. జూలై 7వ తేదీ తెల్లవారుజామున 1:34 గంటలకు శ్రీనివాస్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపో యారు. ప్రమాదానికి కారణమైన బైక్ డ్రైవర్ భానూరి విజయ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా, శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

## తెలంగాణలోని పేదలకు కేంద్రం భారీ శుభవార్త..



**హైదరాబాద్, జూలై 07 :** ఇళ్లు అనేది లక్షలాదిమంది పేద, మధ్య తరగతి ప్రజలకు ఓ ఎమోషన్.. సొంతిల్లు కట్టుకోవడం ఓ కలగా పెట్టుకుంటారు. రూపాయి రూపాయి పోగేసి ఇళ్లు కట్టుకోవడమే వారి జీవితాశయంగా ఉంటారు. ఇప్పటికీ సొంతిళ్లు లేని పేద, మధ్య తరగతి కుటుంబాలు రాష్ట్రంలో అనేకం ఉన్నాయి. దాంతో అటు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు పేరుతో పేదలకు ఇళ్లు కట్టిస్తోంది. అలాగే కేంద్రం తీసుకొచ్చిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా కూడా రాష్ట్రంలోని పేదలకు సొంతింటి కల నెరవేరుతోంది. ఈ క్రమంలోనే తెలంగాణలోని పేద, మధ్య తరగతి ప్రజలకు కేంద్ర ప్రభుత్వం భారీ శుభవార్త ప్రకటించింది. అదేంటి అంటే..? ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై)- పట్టణ 2.0 పథకం కింద తెలంగాణకు మరో 8,338 ఇళ్లు కేటాయించింది కేంద్ర ప్రభుత్వం. ఇటీవల కేంద్ర గృహ నిర్మాణ శాఖకు రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనలను పరిశీలించి ఈ మేరకు ఆమోదం తెలిపింది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ. 125 కోట్ల ఆర్థిక సాయం అందించనుంది. ఈ మొత్తంలో తొలి విడతలో భాగంగా రూ. 50 కోట్లను రాష్ట్రానికి అందించేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ పథకం కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు ఈ ఏడాది సెప్టెంబర్ 30 లోపు కచ్చితంగా పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఆ తర్వాత జరిగే పనులకు సాయం ఉండదని పేర్కొంది. ఇక గతంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం 4.30 లక్షల ఇళ్లను కేటాయించినట్లు పేర్కొన్న విషయం తెలిసిందే. ఇక ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు ప్రభుత్వం సొంతిళ్లు నిర్మించుకోవడానికి ఆర్థిక సాయం అందిస్తోంది. అర్హులైన ప్రతి కుటుంబం కేంద్ర ప్రభుత్వం అందించే ఈ సాయం పొందొచ్చు. ఈ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు కట్టుకునేవారికి ప్రభుత్వం 1.20 లక్షల రూపాయలు సాయం అందిస్తుంది. అలాగే పట్టణాల్లో నివసించే వారికి 1.50 లక్షల రూపాయల ఆర్థిక సాయం చేస్తోంది. ఈ పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం చొప్పున నిధులను భరిస్తుంటాయి.

## వరి బోనస్ చెల్లింపుల్లో కీలక మార్పులు



**హైదరాబాద్, జూలై 07 :** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతిష్ఠాత్మకంగా మఅలు చేస్తున్న సన్న వడ్ల బోనస్ పథకంలో కీలక మార్పులు చేసింది. రైతులు పండించిన సన్న రకం వడ్లకు మార్కెట్ ధరతో పాటు అదనంగా క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ అందిస్తున్నారు. డబ్బును నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోనే జమ చేస్తున్నారు. ప్రస్తుత వానాకాలం సీజన్ నుండి సరికొత్త మార్గదర్శకాలను అమలు చేయాలని వ్యవసాయ శాఖ డిసైడ్ అయింది. ప్రభుత్వం రైతులు విక్రయించిన సన్న వడ్లకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ జమ చేస్తోంది. వీటిని నేరుగా రైతు ల బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం వేస్తోంది. అయితే ఈ బోనస్ అందించేందుకు పలు విధివిధానాలు మార్చింది. ఇక నుంచి ప్రభుత్వం ప్రకటించిన 7 రకాల సన్న రకం విత్తనాలు వేసి పండించిన రైతులకు మాత్రం బోనస్ అందుతుంది. ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన 7 ప్రత్యేక రకాల సన్న వరి విత్తనాలను వేసి పండించిన రైతులకు మా త్రమే క్వింటాకు రూ.500 బోనస్ సొమ్ము అం దుతుంది. ఈ పథకానికి అర్హత సాధించాలంటే రైతులు కొనుగోలు చేసే విత్తనాల రికార్డులు ఆన్‌లైన్‌లో కచ్చితంగా నమోదవ్వాలి. ఇందుకోసం వ్యవసాయ శాఖ ప్రత్యేక ఆన్‌లైన్ ప్రక్రియను అందు బాటులోకి తెచ్చింది. కాగా, ఇక నుంచి ప్రభుత్వ అనుమతి పొందిన విత్తన డీలర్లు తాము రైతులకు విక్రయించే ప్రతి సన్న వరి విత్తన రకం వివరాలను వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేసారు. సన్న వరి రకం విక్రయాల ఆప్షన్‌ను ఎంచుకుని విత్తనాలు కొనుగోలు చేసిన రైతు పేరు, తండ్రి పేరు, విత్తన రకం, కంపెనీ పేరు, లాట్ నంబర్, సీడ్ ప్యాకెట్ సైజ్, కొనుగోలు చేసిన తేదీ లాంటి వివరాలు నమోదు చేయాలని స్పష్టం చేసారు. వానాకాలం సీజన్‌లో విక్రయించే విత్తనాలకు మాత్రమే ఈ డిజిటల్ విధానం అమల్లో ఉంటుంది. ర్ఎన్ఆర్-15048, బీపీటీ-5204, కేఎన్ఎం-1638, హెచ్ఎంటీసోనా,జై శ్రీరామ్, డబ్ల్యుజీ ఎల్-44, కేఎన్ఎం-7715 రకాలు పండించిన రైతు లకు మాత్రమే బోనస్ అందిస్తారు. అక్రమాల నియంత్రణకోసం ఈనిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

## ప్రియుడి కోసం భర్త హత్య..

- మియాపూర్‌లో భార్య దారుణం




**హైదరాబాద్, జూలై 07 :** హైదరాబాద్‌లోని మియాపూర్‌లో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. జీవితాంతం తోడుంటానని ప్రమాణం చేసిన భార్యే భర్తను హత్య చేసి, ప్రియుడితో కలిసి శవాన్ని మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో పూడ్చిపెట్టిన ఘటన సంచలనం సృష్టించింది. పోలీసు లు వెల్లడించిన వివరాల ప్రకారం, పెంటేశ్ (45) అనే వ్యక్తిని అతని భార్య సత్యవతి తన ప్రియుడి సహాయంతో హత్య చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. హత్య అనంతరం నేరాన్ని దాచిపెట్టేందుకు నిందితులు శవాన్ని వాహనంలో తరలించి మహా రాష్ట్ర సరిహద్దు ప్రాంతానికి తీసుకెళ్లి పూడ్చిపెట్టినట్లు పోలీసులు గుర్తించారు. అనుమానం రాకుండా భర్త కనిపించడం లేదంటూ సత్యవతి పోలీసులకు ఫిర్యాదు చేసి తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసింది. కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు కాల్ డేటా రికార్డులు, సీసీటీవీ ఫుటేజ్, ఇతర సాంకేతిక ఆధారాలను పరిశీలించగా అసలు ఘటన వెలుగులోకివచ్చింది. విచారణలో భార్య ప్రవర్తనపై అనుమానంరావడంతోలోతుగా దర్యాప్తు చేపట్టిన అధికారులు హత్యవెనుక ఉన్న కుట్రను ఛేదించా రు. ప్రస్తుతం నిందితులను అదుపు లోకి తీసుకుని ప్రశ్నిస్తున్న పోలీసులు, హత్యకు దారితీసిన పరిస్థి తులు, ఘటనలో మరెవరైనా ప్రమేయం ఉందా అనే కోణంలో దర్యాప్తు కొనసాగి స్తున్నారు. శవాన్ని వెలి కితీసి పోస్టుమార్టం నిర్వహించేందుకు కూడా చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఈ ఘటన స్థానికం గా తీవ్ర కలకలం రేపగా, కుటుంబ కలహాలు చివ రకు హత్యకు దారితీయడం పట్ల స్థానికులు ఆందో ళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు పూర్తి వివరాల ను త్వరలో అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది.

## ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్ చోరీ ముఠా అరెస్ట్

- ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి కాయిల్స్ చోరీ చేస్తున్న ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్ట్



**హైదరాబాద్, జూలై 07 :** ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి కాయిల్స్ చోరీ చేస్తున్న ఆరుగురు నిందితుల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు పట్టణ ంలోని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేరుల సమావేశంలో సీపీ సాయిచైతన్య వివరాలు వెల్లడిం చారు. ఆర్మూర్ పోచమ్మ గల్లీకి చెందిన అన్నదమ్ములు కర్రె వినోద్ కుమార్, కర్రె విజయ్‌తో పాటు అంద్రాసి నవీన్, గుంబోల్ల ఈశ్వర్, బాజ హరిప్రసాద్, మూల దుర్గాప్రసాద్ రెడ్డి ముఠాగా ఏర్పడ్డారు. పాత ఇనుప సామాన్లు సేకరిస్తూ ఆర్మూర్ పట్టణంలోని స్క్రాప్ వ్యాపారి అబ్దుల్ వసీం అలియాస్ తిల్లి బాబాకు విక్రయిస్తుండేవారు. వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవారు. ఆరుగురు తిల్లిబాబా సలహా మేరకు పాత ఇనుప సామగ్రి వ్యాపారం పేరుతో గ్రామాల్లో సంచరిస్తూ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించేవారు. వేల్పూర్, బాల్కొండ, మెండోరా, భీంగల్, ఆర్మూర్, ఏర్గట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో రాత్రివేళ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి రాగి కాయిల్స్ దొంగిలించి అతడికే విక్రయించేవారు. నిందితులపై వేల్పూర్‌లో4,బాల్కొండలో5, మెండోరలో 3, భీమ్‌గల్‌లో 1, ఆర్మూర్‌లో 5, ఏర్గట్లలో 1 చొప్పున మొత్తం 19 కేసులున్నాయని సీపీ తెలిపారు. అబ్దుల్ వసీం పైనా గతంలో చోరీ సొత్తు కొన్న కేసులు ఉన్నాయన్నారు. ఉదయం పడగల్ గ్రామశివారు పాత బీటీ రోడ్, పసుపు బోర్డు సమీపంలోని రైల్వే బ్రిడ్జ్ వద్ద ఆరుగురితో పాటు ఆర్మూర్‌లో అబ్దుల్ వసీంను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి బజాజ్ మాక్సిమా ట్రాలీ ఆటో, బజాజ్ డిస్కవర్ బైక్, 5 మొబైల్ ఫోన్లు, చోరీకి ఉపయోగిం చిన పనిముట్లు, 74 కిలోల రాగి తీగను స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో, కాలనీల్లో ఎవరైన అనుమానితులు తిరుగతుంటే పోలీసుల కు సమాచారం ఇవ్వాలని సీపీ తెలిపారు. సమావేశంలో అడిషనల్ డీసీపీసుదన్ నాగోలే, ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్‌హెచ్‌వో సత్య నారాయణ గౌడ్, ఆర్మూర్ రూరల్ సీఐ జాన్ రెడ్డి, ఎస్సైలు పాల్గొన్నారు.

## హైకోర్టు ప్రాంగణంలో డా.అంబేడ్కర్ విగ్రహానికి చీఫ్ జస్టిస్ ఆఫ్ తెలంగాణ హామీ



**హైదరాబాద్, జూలై 07 :** తెలంగాణ హైకోర్టులో దళిత వర్గాల సుదీర్ఘ స్వప్నం త్వరలో నేరవేరనుంది, తన పుట్టిన రోజు సందర్భంగా ఈరోజు తనని కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన దళిత న్యాయవాదులతో చీఫ్ జస్టిస్ ఆపరేశ్ కుమార్ తన ఆనందాన్ని పంచుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రెండేళ్ల క్రితమే హైకోర్టు ప్రాంగణంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ జరిగినా కొన్ని కారణాల వల్ల ఆ కార్యక్రమం రూపు దాల్చలేదు. అయితే నేడు చీఫ్ జస్టిస్ ఇచ్చిన స్పష్టమైన హామితో నవంబర్ లో జరిగే రాజ్యాంగ దినోత్సవం నాటికి హైకోర్టు ప్రాంగణంలో రాజ్యాంగ నిర్మాత విగ్రహ ఏర్పాటు మార్గం సుగమం అయింది. ఈసందర్భంగా చీఫ్ జస్టిస్ ఆపరేశ్ కుమార్ గారికి శాలువా, బోకే బహుకరించి తమ ఆనందాన్ని సాటి న్యాయవాదులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ మాదిగ కన్వీనర్ దున్న అంబేద్కర్, గౌరవ అధ్యక్షులు ఇనుగాల భీమా రావు, శ్రీలత, పారిజాత,రామకృష్ణ, సుమిత్ర, యాదీశ్వర్ తదితర న్యాయవాదుల బృందం సీజేకి శుభాకాంక్షలు తెలిపారు.

బలగం TV BALAGAM
balagamtv100@gmail.com

# సంపాదకీయం

## ఉద్యోగుల వేతనాల పై రేవంత్ కీలక నిర్ణయం

ముఖ్యమంత్రి రేవంత్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఉద్యోగుల జీతాలపై అధికారులకు స్పష్ట మైన ఆదేశాలు ఇచ్చారు. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేసినప్పటికీ, ఉద్యోగుల కు సమయానికి జీతాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేసే ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు తేల్చి చెప్పారు. డిజిటల్ గవర్నెన్స్ దిశగా ప్రణాళికలు సిద్ధం చేసి, అవసరమైన చట్టాలను రూపొందించండని ఆదేశించారు. పరిపాలన వ్యవస్థను పూర్తి స్థాయిలో డిజిటలైజ్ చేస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ అధికారులకు కీలక సూచనలు చేసారు. రాష్ట్రంలో డిజిటల్ గవర్నెన్స్ దిశగా సమగ్ర ప్రణాళికలను సిద్ధం చేసి అవసరమైన మేరకు చట్టాలను రూపొందించాలని చెప్పారు. రాష్ట్రంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి ఉన్నతాధికా రులతో సమీక్షించారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరే విధంగా అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 1వ తారీఖున జీతాలు అందించేలా వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని స్పష్టంగా చెప్పారు. వివిధ విభాగాలలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, జీతాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలను డిజిటలైజ్ చేయాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 4,800 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఉండగా, ఇందులో 4,300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. కాగా, ఏజెన్సీలకు ప్రభుత్వం చెల్లింపులు చేసినా, ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి అలాంటి ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డిజిటల్ గవర్నెన్స్‌తో ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టాలని సూచించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 1 నుంచి గరిష్ఠంగా 5వ తేదీలోగా పారదర్శకంగా జీతాలు చెల్లింపులు జరిపేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని అన్నారు. అందుకే పూర్తి వివరాలను డిజిటలైజ్ చేయాలని తెలిపారు. ప్రభుత్వం నుంచి చెల్లింపులు జరిగినప్పటికీ సమయానికి ఉద్యోగులకు జీతాలు చెల్లించని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై పూర్తిస్థాయిలో కసరత్తు చేసేందుకు వీలుగా ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమించాలని ముఖ్యమంత్రి గారు సూచించారు. ఈ కమిటీ 100 రోజుల్లో నివేదిక సమర్పించి ఈ అంశాన్ని ఒక కొలిక్కి తీసుకురావాలని ఆదేశించారు.



# రంగారెడ్డి జిల్లాకు మహర్దశ



### రేడియల్ రోడ్ 2 నిర్మాణ పనులు స్పీడప్!

**హైదరాబాద్, జూలై 07 :** తెలంగాణా రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్ నగర పరిధిలోనూ, నగరం చుట్టుపక్కల ప్రాంతాలలోనూ అభివృద్ధికి తెలంగాణా సర్కార్ ఫోకస్ చేస్తుంది. ఈ క్రమంలో హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల అభివృద్ధికి మరో ముఖ్యమైన అడుగు పడింది. రేడియల్ రోడ్- 2 నిర్మాణం కోసం శంషాబాద్ - షాద్ నగర్ డివిజన్ పరిధిలో భూసేకరణ ప్రక్రియ వేగంగా ముందుకు సాగుతోంది. ఈ రోడ్ నిర్మాణం కోసం రెవిన్యూ అధికారులు రైతులతో భూసేకరణకు సంబంధించిన సానుకూలమైన చర్చలు జరిపారు. ఈ క్రమంలో పది రోజుల్లో భూసేకరణను పూర్తి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యంగా షాద్నగర్ డివిజన్లోని చుక్కమెట్, ముట్ పూర్, లాలాపేట్, తుమ్మపల్లి, ఉమ్మెత్యాల్ వంటి గ్రామాలలో ఈ రహదారి నిర్మాణానికి అవసరమైన భూములను సేకరించే పనులు జరుగుతున్నాయి. ఇక్కడ భూములు ఇవ్వడానికి రైతులకు ఉన్న అభ్యంతరాలను తెలుసుకుని రైతులతో మాట్లాడి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, స్థానిక శాసనసభ్యులు వీర పల్లి శంకర్ రైతులను ఒప్పించారు. దీంతో ఈ రహదారి నిర్మాణానికి అవసరమైన భూములను సేకరించే పనులలో వేగం పెరిగింది. ఆర్ఆర్ యాక్ట్ 2013 ప్రకారం మార్కెట్ విలువకు అనుగుణంగా , పారదర్శకంగా పరిహారం చెల్లించేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు స్వచ్ఛందంగా అంగీకార పత్రాలు అందించడంతో భూసేకరణ పనులలో వేగం పుంజుకుంది. బుద్వేల్ నుంచి ప్రారంభమయ్యే ఈ రహదారి షాబాద్, కొందూరు, పరిగి మండలాల మీద కొడంగల్ వరకు 81 కిలోమీటర్ల మేర కొనసాగనుంది. అత్యాధునిక ప్రమాణాలతో నిర్మించే ఈ రోడ్డు హైదరాబాద్ ఎయిర్పోర్ట్ ప్రాంతం నుంచి కొడంగల్ వరకు మంచి కనెక్టివిటీని అందిస్తుంది. ఈ రహదారి పూర్తి కావడం ద్వారా శంషాబాద్, షాద్ నగర్ ప్రాంతాలలో పారిశ్రామిక కారిడార్లు వేగంగా అభివృద్ధి చెందుతాయి. ఈ రహదారి నిర్మాణంతో ఐటి మరియు ఇతర పరిశ్రమలు కూడా ఈ ప్రాంతాలలో విస్తరించే అవకాశం ఉంటుంది. ఎయిర్పోర్ట్ కార్గో టెర్మినల్ నుంచి భారీయంత్రాలు, ముడిపదార్థాలు ఈ మార్గంలో సులభంగా తరలించడానికి వీలవుతుంది. ఈ రేడియల్ రోడ్డు 2 నిర్మాణం పూర్తయితే సమీప గ్రామాలు మండలాలలో పారిశ్రామికీకరణ వేగం పుంజుకుంటుంది. స్థానిక యువతకు వేల సంఖ్యలో ఉపాధి అవకాశాలు వస్తాయి. మారుమూల గ్రామాలకు సైతం రవాణా సౌకర్యం ఏర్పడుతుంది. పారిశ్రామిక జోన్ ఏర్పడి ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. ఇది హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారికి కూడా ప్రత్యామ్నాయ మార్గం అవుతుంది. అంతేకాదు ఈ ప్రాజెక్టు హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలను మెగా గ్రోత్ కారిడార్లు గా మార్చడంలో కీలక భూమిక పోషిస్తుంది.

# ఇక 5 రోజులు వర్షాల జోరు



### ఈ జిల్లాలకు తాజా హెచ్చరిక..!!

**హైదరాబాద్, జూలై 07 :** తెలుగు రాష్ట్రాలకు వాతావరణ శాఖ కీలక అప్డేట్ ఇచ్చింది. వాతావరణంలో పలు మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రాబోయే ఐదు రోజుల పాటు వాతావరణం పూర్తిగా చల్లబడనుందని అధికారులు వెల్లడించారు. ఏపీ ,తెలంగాణలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఈదురు గాలులతో కూడిన వర్షాలు రెండు రాష్ట్రాల్లోనూ కొనసాగుతాయని అంచనా వేసింది. వాతావరణ శాఖ భారీ వర్షాల పై అలర్ట్ చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన కొన్ని ప్రత్యేక వాతావరణ పరిస్థితుల వల్ల ఈ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. తెలంగాణలోని చాలా జిల్లాలలో అక్కడక్కడా గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో భారీ గాలులు వీస్తాయని అధికారులు పేర్కొన్నారు. ఈ నెల 11వ తేదీ వరకు ఈ ఈదురు గాలుల తీవ్రత కొనసాగుతుందని అప్రమత్తం చేస్తున్నారు. బలమైన గాలుల వల్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తెలంగాణ వ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో మోస్తరు జల్లులు పడే అవకాశం ఉంది. అయితే రాబోయే 48 గంటల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వెల్లడించారు. ముఖ్యంగా ఆదిలాబాద్, కుమరమ్ భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి వంటి జిల్లాలలో ఈ ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. ఏపీలోనూ వర్షాలు కొనసాగనున్నాయి.

రానున్న అయిదు రోజసులు కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాలలో ఈదురు గాలులతో కూడిన మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. మంగళవారం శ్రీకాకుళం జిల్లాలో విస్తారంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ శాఖ తెలిపింది. కాగా,శ్రీకాకుళంతో పాటు ఉత్తర కోస్తాలోని విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో కూడా వానలు పడవచ్చని అంచనా వేస్తోంది. మిగిలిన జిల్లాలలో కూడా ఆకాశం మేఘావృతమై ఉండి, అక్కడక్కడా తేలికపాటి చినుకులు పడే అవకాశం ఉందని విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది.

# ఇంటర్ విద్యార్థులకు శుభవార్త..




### ప్రాక్టికల్ పరీక్షల్లో కీలక మార్పులు...

**హైదరాబాద్, జూలై 07 :** ఇంటర్మీడియట్ విద్యార్థులకు రాష్ట్ర ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు సెకండ్ ఇయర్‌లో మాత్రమే నిర్వహిస్తున్న ప్రాక్టికల్ పరీక్షల విధానాన్ని మార్చుతూ, ఇకపై ఫస్ట్ ఇయర్ నుంచే ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు సెక్రటరీ అభిలాష అభినవ్ ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త విధానం ద్వారా విద్యార్థులు రెండు సంవత్సరాల పాటు సబ్జెక్టులపై మెరుగైన అవగాహన పెంపొందించుకునే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.కొత్త విధానం ప్రకారం ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టుల ప్రాక్టికల్ మార్కులను 30 నుంచి రెండు భాగాలుగా విభజించారు. ఇకపై ఫస్ట్ ఇయర్‌లో 15 మార్కులకు, సెకండ్ ఇయర్‌లో మరో 15 మార్కులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. దీంతో చివరి ఏడాదిలో 30 మార్కుల ప్రాక్టికల్ పరీక్షపై విద్యార్థులు ఎదుర్కొనే ఒత్తిడి తగ్గనుంది.ఫస్ట్ ఇయర్ నుంచే ప్రాక్టికల్స్ నిర్వహించడం వల్ల ప్రయోగాలపై విద్యార్థులకు ప్రారంభం నుంచే అవగాహన పెరుగుతుంది. అలాగే సెకండ్ ఇయర్ నాటికి మరింత ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరయ్యే అవకాశం ఉంటుంది. థియరీ పరీక్షలు మాత్రం యథాతథంగా 60 మార్కులకే కొనసాగనున్నాయి. దీంతో అకడమిక్ సమతుల్యతకు ఎలాంటి ఇబ్బంది ఉండదని బోర్డు స్పష్టం చేసింది.రెండు సంవత్సరాల్లో జరిగే ప్రాక్టికల్ పరీక్షలను కూడా బోర్డు నియమించిన ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్ల పర్యవేక్షణలోనే నిర్వహించనున్నారు. దీంతో పరీక్షల పారదర్శకత పెరగడంతో పాటు విద్యార్థుల సబ్జెక్టు పరిజ్ఞానం కూడా మెరుగుపడుతుందని అధికారులు భావిస్తున్నారు.విద్యార్థుల సౌకర్యార్థం ఈసారి ల్యాబ్ మ్యాన్యువల్స్‌ను డిజిటల్ రూపంలో బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. అందులో కొత్త సిలబస్, మోడల్ ప్రశ్నాపత్రాలు, ప్రయోగాల విధానం వంటి వివరాలను పొందుపరిచింది. నెలవారీ ప్రణాళిక ప్రకారం ప్రయోగాలు నేర్చుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.ప్రాక్టికల్ పరీక్ష సమయంలో విద్యార్థులు తప్పనిసరిగా రికార్డు బుక్ సమర్పించాల్సి ఉంటుంది. పరీక్ష వ్యవధి గంటన్నరగా నిర్ణయించారు. కాలేజీల్లో ల్యాబ్ తరగతులను క్రమం తప్పకుండా నిర్వహించాలని, అవసరమైన కెమికల్స్, మైక్రోస్కోప్స్ తదితర పరికరాలను సిద్ధంగా ఉంచాలని ప్రిన్సిపాళ్లకు బోర్డు ఆదేశాలు జారీ చేసింది. పరీక్షల్లో అక్రమాలకు ఎలాంటి అవకాశం లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని కూడా హెచ్చరించింది.

# ఫ్రాన్స్ అధ్యక్షుడు బసచేసిన హోటల్ వద్ద భారీ పేలుడు..





**న్యూఢిల్లీ, జూలై 07 :** సిరియా రాజధాని డమాస్కస్ లో మంగళవారం భారీ పేలుళ్లు సంభవించాయి. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ సిరియా పర్యటనలో భాగంగా ఆ దేశ నూతన అధ్యక్షుడు అహ్మద్ అల్-షరాతో కీలక సమాలోచనలు జరుపుతున్న కొద్దిసేపటికే ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. మెక్రాన్ బస చేసిన ఫోర్ సీజన్స్ హోటల్ సమీపంలో జరిగిన ఈ జంట పేలుళ్లలో కనీసం 18 మంది తీవ్రంగా గాయపడినట్లు సిరియా అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారికంగా ధ్రువీకరించింది. ప్రమాదం జరిగిన సమయంలో అధ్యక్షుడు మెక్రాన్ అధ్యక్ష భవనంలో సురక్షితంగా ఉన్నారని, ఆయనకు ఎటువంటి ముప్పు వాటిల్లలేదని ఫ్రెంచ్ అధ్యక్ష కార్యాలయం స్పష్టం చేసింది. రెండు దేశాల అధినేతల మధ్య దౌత్యపరమైన చర్చలు యథావిధిగా కొనసాగాయని తెలిపింది. రహదారి పక్కన ఉన్న చెత్తకుండీలో ఒకటి, పార్క్ చేసిన కారులో మరొకటి పేలుడు పదార్థాలు అమర్చినట్లు స్థానిక పోలీసులు గుర్తించారు. ఈ ఘటనలో గాయపడిన వారిలో నలుగురు పోలీసు అధికారులు కూడా ఉన్నట్లు సమాచారం. సిరియాలో 2024లో బషర్ అల్-అస్సాద్ నేతృత్వంలోని సుదీర్ఘ ఏకఛత్రాధిపత్య పాలన ముగిసిన తర్వాత అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వంతో భేటీ అయిన తొలి ప్రముఖ పాశ్చాత్య దేశాధినేత మెక్రాన్ కావడం గమనార్హం. 14 ఏళ్లపాటు సాగిన సుదీర్ఘ అంతర్యుద్ధంతో పూర్తిగా దెబ్బతిన్న సిరియాను ఆర్థికంగా ఆదుకోవడానికి, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి మెక్రాన్ ఒక పెద్ద ఆర్థిక ప్రతినిధి బృందంతో కలిసి పర్యటిస్తున్నారు. సిరియాపై ఉన్న పలు అంతర్జాతీయ ఆంక్షలను అమెరికా, యూరప్‌లు తొలగించడంలో ఫ్రాన్స్ కీలక పాత్ర పోషిస్తోంది. శాంతిభద్రతలను పునరుద్ధరిస్తూ, నూతన ప్రభుత్వ విధానాలపై పాశ్చాత్య దేశాలలో నమ్మకం కలిగించడానికి అధ్యక్షుడు అల్-షరా శ్రమిస్తున్న తరుణంలో ఈ దాడులు జరగడం పెద్ద సవాల్‌గా మారింది. ఒకప్పుడు అల్-ఖైదాతో సంబంధాలు ఉన్న హయాత్ తహ్రీర్ అల్-షామ్ గ్రూప్‌నకు నాయకత్వం వహించిన అల్-షరా, ఇప్పుడు దేశాన్ని ప్రజాస్వామ్య మార్గంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. రాజధాని డమాస్కస్ ఇటీవలి కాలంలో ప్రశాంతంగా ఉన్నప్పటికీ, కొన్ని రోజుల క్రితమే ఒక కేఫ్‌లో జరిగిన బాంబు పేలుడులో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. సుదీర్ఘ యుద్ధం కారణంగా సిరియా మౌలిక సదుపాయాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దేశాన్ని తిరిగి గాడిన పెట్టడానికి వందల బిలియన్ డాలర్ల నిధులు అవసరమైన తరుణంలో, ఫ్రాన్స్‌తో కుదుర్చు కునే ఆర్థిక అవగాహన ఒప్పందాలు సిరియా భవిష్యత్తుకు అత్యంత కీలకంగా మారాయి. ఈ పేలుళ్లకు బాధ్యత వహిస్తూ ఇప్పటివరకు ఏ విపక్ష లేదా ఉగ్రవాద సంస్థ కూడా ప్రకటన విడుదల చేయలేదు. ఈ దాడి వెనుక ఉన్న కుట్ర కోణాలను వెలికితీసేందుకు సిరియా నిఘా వర్గాలు దర్యాప్తును వేగవంతం చేశాయి.

# అహ్మదాబాద్ బాంబు పేలుళ్ల కేసు.. 38 మందికి ఉరిశిక్ష

**ఖరారు చేసిన గుజరాత్ హైకోర్టు**

**బలగం టీవి, హైదరాబాద్**

2008లో అహ్మదాబాద్‌లో జరిగిన వరుస బాంబు పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో 38 మందికి మరణశిక్ష, 11 మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ 2022లో ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. కింది కోర్టు తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన అప్పీళ్లను హైకోర్టు కొట్టివేసింది.బాధిత కుటుంబాలకు తగిన నష్టపరిహారం చెల్లించాలని గుజరాత్ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. పేలుళ్లలో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.10 లక్షలు, గాయపడిన వారికి రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లించి, 2027 మార్చి 31లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించింది.




**2008లో సంభవించిన ఘోర పేలుళ్లు**

2008 జూలై 26న అహ్మదాబాద్ నగరంలోని 21 ప్రాంతాల్లో వరుస బాంబు పేలుళ్లు జరిగాయి. ఈ ఘటనలో 56 మంది మృతి చెందగా, 246 మంది గాయపడ్డారు. ఆస్పత్రులు సహా పలు రద్దీ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని పేలుళ్లు జరిపారు. ఘటన జరిగిన రెండు రోజుల తర్వాత సూరత్ నగరంలో కూడా పేలని బాంబులను పోలీసులు గుర్తించి నిర్వీర్యం చేశారు. పేలుళ్ల తీవ్రత కారణంగా సమీప ప్రాంతాల్లో ఉన్న కొందరు కొంతకాలం వినికిడి సమస్యలను ఎదుర్కొన్నారు.

**49 మందికి శిక్ష.. 25 మందికి విముక్తి**

దర్యాప్తులో అహ్మదాబాద్ క్రైమ్ బ్రాంచ్ మొత్తం 100 మందిని నిందితులుగా గుర్తించగా, 78 మందిపై విచారణ జరిగింది. 2022లో ప్రత్యేక కోర్టు 49 మందిని దోషులుగా నిర్ధారించి, 25 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. ఒక నిందితుడు అప్రూవర్‌గా మారడంతో అతనికి క్షమాభిక్ష లభించగా, వాంగ్మూలాలను ఉపసంహరించుకున్న మరో నలుగురు అప్రూవర్లకు శిక్షలు విధించింది.

**జైలు నుంచి పరారయ్యే కుట్ర విఫలం**

ఈ కేసు విచారణ సమయంలో 24 మంది నిందితులు టన్నెల్ తవ్వి జైలు నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించిన ఘటన కూడా వెలుగులోకి వచ్చింది. అయితే పోలీసులు ఆ కుట్రను ముందుగానే గుర్తించి భగ్నం చేశారు. దర్యాప్తు సంస్థల ప్రకారం, 2002 గోద్రా అనంతర అల్లర్లకు ప్రతీకారంగా ఈ పేలుళ్లు జరిగినట్లు విచారణలో తేలింది. అనంతరం ఈ దాడులకు ఇండియన్ ముజాహిదీన్ బాధ్యత వహిస్తున్నట్లు ప్రకటించింది.

# ప్రియుడితో కలిసి భర్త హత్య..

**మిస్సింగ్ డ్రామాతో పోలీసులను మభ్యపెట్టిన భార్య అరెస్ట్**

**బలగం టీవి, హైదరాబాద్**

వివాహేతర సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడనే కారణంతో ఓ మహిళ ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసి, అనంతరం అతడు కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంచలన ఘటన మియాపూర్‌లో వెలుగుచూసింది. పోలీసుల దర్యాప్తులో అసలు విషయం బయటపడటంతో నిందితురాలు, ఆమె ప్రియుడిని అదుపులోకి తీసుకున్నారు.

పోలీసుల వివరాల ప్రకారం.. మియాపూర్‌కు చెందిన పెంటేశ్ (45), సత్యవతి దంపతులు. సత్యవతికి మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడింది. తమ బంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని భావించిన ఆమె, ప్రియుడితో కలిసి హత్యకు పథకం రచించింది. గత ఏడాది నవంబర్‌లో భర్తకు అన్నంలో నిద్రమాత్రలు కలిపి స్పృహ కోల్పోయేలా చేసిన అనంతరం ప్రియుడి సహాయంతో అతడిని హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతానికి తరలించి కాల్చివేసినట్లు విచారణలో వెల్లడైంది. హత్య అనంతరం అనుమానం రాకుండా ఉండేందుకు సత్యవతి స్వయంగా మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో తన భర్త కనిపించడం లేదంటూ మిస్సింగ్ ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా, సత్యవతి ప్రవర్తనపై అనుమానం వ్యక్తమైంది. దీంతో ఆమె మొబైల్ కాల్ డేటా, సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు భర్త అదృశ్యమైన సమయంలో ఆమె, ప్రియుడి కదలికలు అనుమానాస్పదంగా ఉన్నట్లు గుర్తించారు. అనంతరం విచారణలో సత్యవతి నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు, మృతదేహానికి సంబంధించిన ఆధారాల సేకరణ కోసం మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతానికి వెళ్లారు. కేసుకు సంబంధించి మరింత లోతుగా దర్యాప్తు కొనసాగుతున్నట్లు మియాపూర్ పోలీసులు వెల్లడించారు.

# నాచారంలో భారీ డ్రగ్స్

**రూ.1.60 కోట్ల నిషేధిత సింథటిక్ డ్రగ్ స్వాధీనం!**

**ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల మెరుపు దాడులు..**

**గుజరాత్ లింకులు గుర్తింపు.. ఒకరిపై కేసు నమోదు**

**బలగం టీవి, హైదరాబాద్**

రాజధాని నగరంలో మరోసారి భారీగా నిషేధిత మత్తుపదార్థాలు పట్టుబడటం తీవ్ర కలకలం రేపింది. రాష్ట్ర ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల సంయుక్త తనిఖీల్లో సుమారు రూ.1.60 కోట్ల విలువైన నిషేధిత సింథటిక్ డ్రగ్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్ కంట్రోల్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అవినాశ్ మహంతి ఆదేశాల మేరకు మంగళవారం నాచారంలోని 'హైమా సింథసిస్ ప్రైవేట్ లిమిటెడ్' ట్రేడింగ్ షాపులో అధికారులు ముమ్మర దాడులు నిర్వహించారు.

**5.860 కిలోల 'ఎన్-బెంజైల్‌పైపెరాజైన్' సీజ్!**

ఎస్టీఎఫ్ డీ-టీమ్ డీఎస్పీ తిరుపతి యాదవ్, సీఐ నాగరాజులతో పాటు డ్రగ్ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్లు ఇందిరా ప్రియదర్శిని, అన్వేష్‌లు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. హైమా సింథసిస్ సంస్థలో అక్రమంగా నిల్వ ఉంచిన 5.860 కిలోల బెంజైల్‌పైపెరాజైన్ (ధీఫా) అనే ప్రమాదకర సింథటిక్ డ్రగ్‌ను గుర్తించి, అధికారులు దానిని సీజ్ చేశారు.

**గుజరాత్ టు హైదరాబాద్.. మెట్రో నగరాలకు సరఫరా**

అధికారుల ప్రాథమిక విచారణలో ఈ డ్రగ్ మాఫియాకు సంబంధించిన కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిందితులు ఈ నిషేధిత డ్రగ్‌ను గుజరాత్ రాష్ట్రం నుంచి గుట్టుచప్పుడు కాకుండా రప్పించినట్లు తేలింది. ఇక్కడి నుంచి హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, ముంబై వంటి ప్రధాన మెట్రో నగరాల్లోని డ్రగ్ పెడ్లర్లకు భారీ మొత్తంలో సరఫరా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ అక్రమ డ్రగ్స్ వ్యాపారానికి సంబంధించి హైమా సింథసిస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ముదిగొండ ఈశ్వర్ అనే వ్యక్తిపై అధికారులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం నిందితుడిని నాచారం ఎక్సైజ్

# రామ మందిరానికి వచ్చిన కానుకలన్నీ భద్రం..

**దుర్వినియోగం జరగలేదు: శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్**

**బలగం టీవి, అయోధ్య**

రామ మందిరానికి భక్తులు సమర్పించిన విలువైన కానుకలన్నీ సురక్షితంగా ఉన్నాయని, వాటికి సంబంధించిన పూర్తి వివరాలను ట్రస్ట్ రికార్డుల్లో నమోదు చేస్తున్నామని శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ కోశాధికారి స్వామి గోవింద్ దేవ్ గిరి స్పష్టం చేశారు. మందిర విరాళాల దుర్వినియోగంపై ఇటీవల వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ట్రస్ట్ మీడియా సమావేశం నిర్వహించి వివరణ ఇచ్చింది. ట్రస్ట్ ఆధీనంలో ప్రస్తుతం భక్తులు సమర్పించిన 2,926 విలువైన కానుకలు భద్రంగా ఉన్నాయని తెలిపారు. వీటిలో 32.259 కిలోల బంగారు వస్తువులు, 1,518.925 కిలోల వెండి, వెండి సంబంధిత వస్తువులు ఉన్నట్లు వెల్లడించారు. ప్రతి కానుకను దాత పేరు, సమర్పించిన తేదీ తదితర వివరాలతో ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నామని చెప్పారు.



ఈ సందర్భంగా ట్రస్ట్ మీడియా ప్రతినిధులకు బంగారు రామచరితమానస్, వజ్రాలతో అలంకరించిన హారం, వెండి చరణ్ పాదుకలు, వెండి కాకభుశుండి విగ్రహం తదితర విలువైన కానుకలను ప్రదర్శించింది. సోషల్ మీడియాలో గల్లంతయ్యాయని ప్రచారం జరిగిన వస్తువులు కూడా ట్రస్ట్ వద్ద భద్రంగానే ఉన్నాయని స్పష్టం చేసింది. స్వామి గోవింద్ దేవ్ గిరి వివరాల ప్రకారం.. 2024 మార్చి 31 నాటికి 16.765 కిలోల బంగారం, 2024-25లో 10.445 కిలోలు, 2025-26లో 5.050 కిలోలు ట్రస్ట్‌కు అందాయి. దీంతో మొత్తం బంగారు నిల్వలు 32.259 కిలోలకు చేరుకున్నాయి. అలాగే వెండి వస్తువులతో పాటు, ప్రభుత్వ పర్యవేక్షణలో కరిగించి శుద్ధి చేసిన 849.272 కిలోల వెండి కూడా నిల్వల్లో ఉందని తెలిపారు. మొత్తం వెండి, వెండి సంబంధిత వస్తువుల బరువు 1,518.925 కిలోలుగా నమోదైనట్లు చెప్పారు.

భక్తులు సమర్పించే ప్రతి విలువైన వస్తువుకు రసీదు జారీ చేస్తున్నామని, ప్రతి ఏడాది స్వతంత్ర చార్టర్డ్ అకౌంటెంట్ సంస్థ ద్వారా భౌతిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుద్ధి కోసం పంపిన వెండి వస్తువులను భారత ప్రభుత్వ మింట్‌లోనే కరిగించి, వాటి బరువు, స్వచ్ఛత ధ్రువపత్రాలు, ఫొటోలను భద్రపరుస్తున్నట్లు వెల్లడించారు. అక్రమాలు జరిగాయని ఎవరైనా భావిస్తే, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయకుండా ఆధారాలను ప్రత్యేక దర్యాప్తు బృందం (ఎస్ఐటీ)కు అందించాలని స్వామి గోవింద్ దేవ్ గిరి సూచించారు. ఇదిలా ఉండగా, విరాళాల నిర్వహణపై మరింత పారదర్శకత తీసుకురావడానికి ట్రస్ట్ పరిపాలనను బలోపేతం చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ట్రస్ట్ వ్యవహారాలను సమర్థంగా పర్యవేక్షించేందుకు లిలిముఖ్య కార్యనిర్వాహణాధికారి (సీఈఓ)లిలిని నియమించనున్నట్లు వెల్లడించింది.

# సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసు..

**సస్పెండెడ్ సీఐ నాగరాజుకు 8 రోజుల పోలీస్ కస్టడీ!**

**సిట్ విచారణకు ఏపీ హైకోర్టు గ్రీన్ సిగ్నల్..**

**దిగువ కోర్టు షరతులు సడలింపు.. కృష్ణలంక పీఎస్‌లో విచారణ**

**బలగం టీవి, అమరావతి,**

రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన యువకుడు గాదె సాయికృష్ణ (25) కస్టోడియల్ డెత్ ఆరోపణల కేసులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మంగళవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో ప్రధాన అభియోగాలు ఎదుర్కొంటూ ప్రస్తుతం సస్పెన్షన్?లో ఉన్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) ఎస్.ఎస్.వి.వి. నాగరాజును జులై 9 నుంచి ఎనిమిది రోజుల పాటు పోలీస్ కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్) న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. హైకోర్టు తాజా ఉత్తర్వుల నేపథ్యంలో సీఐ నాగరాజును విజయవాడలోని కృష్ణలంక పోలీస్ స్టేషన్ లోనే సిట్ అధికారులు విచారించనున్నారు.

**దిగువ కోర్టు షరతులను సడలించిన హైకోర్టు**

గతంలో విజయవాడలోని దిగువ కోర్టు సీఐ నాగరాజును రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులోనే విచారించాలని, ఆ ప్రక్రియ మొత్తాన్ని ఆడియో-వీడియో రికార్డింగ్ చేయాలని షరతులు విధించింది. అయితే, ఈ నిబంధనల వల్ల సాక్ష్యాధారాల సేకరణతో పాటు క్రైమ్ సీన్ రీకన్‌స్ట్రక్షన్ (ఘటనా స్థలి పునర్నిర్మాణం) వంటి కీలక ప్రక్రియలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని సిట్ బృందం హైకోర్టును ఆశ్రయించింది. సిట్ తరపున ప్రభుత్వ న్యాయవాది వినిపించిన వాదనలతో పూర్తిగా ఏకీభవించిన జస్టిస్ కుంచం మహేశ్వరరావు.. దిగువ కోర్టు విధించిన కఠిన షరతులను సడలిస్తూ ఈ కొత్త ఉత్తర్వులు జారీ చేశారు.

**పోలీస్ స్టేషన్‌లో చిత్రహింసలు.. రహస్య దహనం!**

వివిధ కేసుల విచారణ నిమిత్తం విజయవాడకు చెందిన సాయికృష్ణను పోలీసులు మార్కాపురంలో అదుపులోకి తీసుకున్నప్పటి నుంచి అతను అదృశ్యమయ్యాడు. తన కుమారుడిని విజయవాడలోని కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో అక్రమంగా నిర్బంధించి, థర్డ్ డిగ్రీ ఉపయోగించి చిత్రహింసలకు గురిచేసి చంపేశారని, ఆ తర్వాత సాక్ష్యాలను నాశనం చేసేందుకు మృతదేహాన్ని విద్యుత్ శ్మశానవాటికలో రహస్యంగా దహనం చేశారని సాయికృష్ణ తల్లి తన ఫిర్యాదులో ఆరోపించారు.

ఆమె ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ ఏడాది జూన్ 19న సస్పెండెడ్ సీఐ నాగరాజుపై హత్య, అక్రమ నిర్బంధం, సాక్ష్యాల ధ్వంసం వంటి తీవ్రమైన అభియోగాలపై భారతీయ న్యాయ సంహిత (దీచీూ) కింద కేసు నమోదైంది. ఈ కేసు తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం నియమించిన 'సిట్' బృందం, జూన్ 23న సీఐ నాగరాజుతో పాటు అతనికి సహకరించిన ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను అరెస్ట్ చేసింది. తాజాగా లభించిన కస్టడీతో ఈ కేసులోని మరిన్ని నమ్మలేని నిజాలు, లూప్‌హోల్స్ బయటకు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# రాజ్యాధికారంతోనే విశ్వకర్మల మనుగడ..

**మధుసూదనాచారి**

**సోమాజిగూడ ప్రెస్ క్లబ్ రౌండ్ టేబుల్ సమావేశంలో 6 కీలక తీర్మానాల ఆమోదం**

**బలగం టీవి, హైదరాబాద్**

విశ్వబ్రాహ్మణులు ఒక శ్కితిగా ఎదగాలని, రాజ్యాధికారంలో తమ వాటాను చేజిక్కించుకోవాలని శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనా చారి పిలుపునిచ్చారు. రాజ్యాధికారంతోనే ఏ కులానికైనా సముచిత గుర్తింపు, మనుగడ ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. ఐదు వృత్తులను వేర్వేరు కులాలుగా చూపెడుతూ... విశ్వకర్మ జాతి జనాభాను తక్కువ చేసి చూపెట్టడం అత్యంత దారుణమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నాడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో 'విశ్వకర్మ కమ్యూనిటీ జేఏసీ' ఆధ్వర్యంలో నిర్వహించిన రెండో రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ తొలి శాసనసభాపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎన్నికల్లో కేవలం రెండు శాతం ఓట్లే అధికారాన్ని తారుమారు చేస్తున్న తరుణంలో.. రాష్ట్ర జనాభాలో 4 నుంచి 5 శాతం ఉండే విశ్వబ్రాహ్మణులు రాజకీయాధికారంలో కీలకంగా మారతారని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు.




**రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమోదించిన 6 తీర్మానాలు:**

ఒక్కటే కులం: ఐదు వృత్తులైనా అందరూ ఒక్కటే.. అదే విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణుల కులం అని ప్రకటించడం.

మ్యూజియం ఏర్పాటు: విశ్వకర్మల వృత్తుల వైభవాన్ని భావితరాలకు చాటిచెప్పేందుకు ప్రభుత్వ సహకారంతో ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు చేయడం.

వృత్తుల పరిరక్షణ: అంతరించిపోతున్న సాంప్రదాయ వృత్తులను పరిరక్షించేలా చర్యలు చేపట్టడం.

ఆర్థిక అండ: కులవృత్తులపై ఆధారపడిన కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలవాలని కోరడం.

అధ్యయన కేంద్రం: తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ పేరుతో ప్రత్యేక అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానించడం.

పోరాట కార్యాచరణ: డిమాండ్ల సాధనకై ప్రభుత్వాలపై ఒత్తిడి తేవడం, వచ్చే నెలలో మూడో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించడం.

ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు తంగెళ్లపల్లి రవి హాజరై, విశ్వబ్రాహ్మణుల కులం గుర్తింపు, ఐక్యత ఆవశ్యకత గురించి మాట్లాడారు. గ్లోబల్ విశ్వకర్మ ఎన్ఆర్ఐ ప్రతినిధి చైతన్య కూడా పాల్గొని, తన సామాజిక వర్గం అభ్యున్నతికి ఎల్లప్పుడూ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తానన్నారు. పాలకులు తమ తప్పులను సరిదిద్దుకోని పక్షంలో.. హక్కుల సాధనకై పెద్ద ఎత్తున పోరాటానికి సన్నద్ధమవ్వాలని, ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని వక్తలంతా ముక్తకంఠంతో నినదించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్, పారిశ్రామిక వేత్త దేవరకొండ కాళిదాస్, విశ్వకర్మ వేదిక వ్యవస్థాపకులు ఆడ్లూరి రవీంద్రా చారి, రచయితల సంఘం నాయకులు గాజోజు నాగభూషణం, కుందారం గణేశాచారి, ఉపేంద్రాచారి, దుబ్బాక కిషన్‌రావు, ప్రముఖ ఆంకోలాజిస్ట్ డాక్టర్ చింతమడక సాయిరాం, వేదాస్ అధ్యక్షుడు కుమారస్వామి, సదాశ్రీ తదితరులు పాల్గొని విశ్వబ్రాహ్మణుల ఐక్యతను చాటారు.

# నెలరోజులుగా అదృశ్యమైన చిన్నారి జ్ఞానేశ్వరి..

**కీలక ప్రకటన చేసిన పోలీసులు**

**బలగం టీవి, అమరావతి,**



ఏపీ తూర్పు గోదావరి జిల్లాలో నెలరోజులకు పైగా అదృశ్యమైన రెండేళ్ల చిన్నారి జ్ఞానేశ్వరి కేసులో పోలీసులు కీలక ప్రకటన చేశారు. చిన్నారి ఎవరి వద్దనైనా ఉంటే ఎలాంటి భయం లేకుండా క్షేమంగా పోలీసులకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. అలా అప్పగించిన వారిపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోబోమని తుని డీఎస్పీ తిలక్ స్పష్టం చేశారు. తుని మండలం సీహెచ్ అగ్రహారంలోని పామాయిల్ తోటలో కాపలాదారులుగా పనిచేస్తున్న సుంకర గణేశ్, భవాని దంపతుల కుమార్తె జ్ఞానేశ్వరి జూన్ 6న అదృశ్యమైంది. తల్లి వంట చేస్తున్న సమయంలో ఇంటి బయట ఆడుకుంటున్న చిన్నారి కనిపించకుండా పోయింది. కుటుంబానికి చెందిన పెంపుడు కుక్కతో కలిసి కొండవైపు వెళ్లినట్లు స్థానికులు గుర్తించినప్పటికీ, అనంతరం కుక్క మాత్రమే తిరిగి రావడంతో అనుమానాలు వ్యక్తమయ్యాయి.

మంగళవారం డీఎస్పీ తిలక్ మాట్లాడుతూ, చిన్నారి ఆచూకీ కనుగొనడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని తెలిపారు. సమాచారం అందించిన వారి వద్దకు పోలీసులు స్వయంగా వెళ్లి చిన్నారిని స్వీకరిస్తామని చెప్పారు. పరిసర తోటలు, కొండ ప్రాంతాల్లో విస్తృతంగా గాలించినప్పటికీ, క్రూరజంతువుల దాడికి సంబంధించిన ఆనవాళ్లు లభించలేదని వెల్లడించారు. దీంతో అపహరణ కోణంలోనూ దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కేసులో సెల్‌ఫోన్లు వినియోగించని వ్యక్తులపై కూడా ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ప్రజలు సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మవద్దని సూచించారు. చిన్నారి కోసం ఇప్పటికే ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, అటవీశాఖ సిబ్బంది, డ్రోన్ బృందాలు, డాగ్ స్క్వాడ్‌లతో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. చిన్నారి ఆచూకీ తెలిపిన వారికి రూ.1 లక్ష నగదు బహుమతి ప్రకటించినట్లు వెల్లడించారు. కేసు దర్యాప్తులో భాగంగా కుటుంబానికి చెందిన పెంపుడు కుక్కకు జీపీఎస్ ట్రాకర్ అమర్చినప్పటికీ, అనంతరం అది కూడా మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. నెల రోజులు గడిచినా చిన్నారి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

# ఘనంగా 'తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్' 7వ వార్షికోత్సవం!

**'సురక్షితమైన ఆహారం - సురక్షితమైన దేశం' థీమ్‌తో వేడుకలు..**

**'టీసీఏ మ్యాగజైన్' ఆవిష్కరణ..**

**పలు ప్రభుత్వ శాఖలతో కీలక ఒప్పందాలు**

**బలగం టీవి, హైదరాబాద్**




ఆహార భద్రతను ఒక జాతీయ బాధ్యతగా చాటి చెప్పే లక్ష్యంతో 'తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్' (ుజూ) 7వ వార్షికోత్సవ వేడుకలను హైదరాబాద్‌లోని తాజ్ డెక్కన్‌లో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ క్యులినరీ అసోసియేషన్స్, వరల్డ్ అసోసియేషన్ ఆఫ్ చెఫ్స్ సొసైటీస్ అనుబంధ సంస్థ అయిన ఈ అసోసియేషన్ వేడుకలను బ్యూరో డీ ఫ్రాన్స్ హెడ్ పాస్కల్ లోరియో అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్, ఫ్రాన్స్‌లోని వైన్ రాజధాని అయిన 'బోర్డో' వంటి నగరాల మధ్య పర్యాటకం, హోటల్, గ్యాస్ట్రోనమీ రంగాలలో విభిన్న సహకారాలపై తెలంగాణ పర్యాటక శాఖ మంత్రితో చర్చించినట్లు వెల్లడించారు. 'సేవ్ ఫుడ్ - సేవ్ నేషన్'.. చెఫ్‌ల ప్రతిజ్ఞ!ఈ వేడుకల్లో అత్యంత కీలక ఘట్టంగా 'సురక్షితమైన ఆహారం - సురక్షితమైన దేశం' అనే ప్రతిజ్ఞ నిలిచింది. చెఫ్ విజయభాస్కరన్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో చెఫ్‌లు, విద్యావేత్తలు, హాస్పిటాలిటీ నిపుణులు, విద్యార్థులు పాల్గొని ఆహార పరిశుభ్రత, నాణ్యత, ప్రజారోగ్య అత్యున్నత ప్రమాణాలను పాటించేందుకు తమ నిబద్ధతను చాటుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రెసిడెంట్ చెఫ్ అమే మరాఠే మాట్లాడుతూ.. "చెఫ్‌లు కేవలం ఆహారాన్ని వండటమే కాదు, కుటుంబాలను కాపాడతారు, పిల్లల ఆరోగ్యాన్ని రక్షిస్తారు. రాబోయే ఐదేళ్ల పాటు ఈ మిషన్‌కు కట్టుబడి ఉండటం కోసం జీహెచ్ఎంసీ, ఎఫ్ఎస్ఎస్ఏఐ వంటి ప్రభుత్వ సంస్థలతో కలిసి పనిచేస్తాం" అని ప్రకటించారు. నాలుగు ప్రముఖ ప్రభుత్వ శాఖలతో అవగాహనా ఒప్పందాలు

తెలంగాణలో సురక్షితమైన ఆహార పద్ధతులు, జీవవైవిధ్య పరిరక్షణ, క్యులినరీ టూరిజంను ప్రోత్సహించేందుకు గాను ఈ వేడుకల్లో పలు కీలక ప్రభుత్వ శాఖలతో అవగాహనా ఒప్పందాలు (వీశీఖం) జరిగాయి. ఇందులో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (+ఎవీజ), తెలంగాణ రాష్ట్ర జీవవైవిధ్య మండలి, తెలంగాణ అటవీ శాఖ, తెలంగాణ టూరిజం శాఖలు ఉన్నాయి. అలాగే అసోసియేషన్ సాధించిన విజయాలు, పరిశోధనలతో కూడిన అధికారిక 'టీసీఏ మ్యాగజైన్'ను ఈ సందర్భంగా విడుదల చేశారు. సంచలన సెషన్లు.. అవార్డుల ప్రదానం

ఈ సదస్సులో మిషెలిన్ స్టార్ పొందిన ప్రముఖ చెఫ్ గరిమా అరోరా వర్చువల్ పద్ధతిలో ఆహార భద్రతపై ప్రసంగించగా, డాక్టర్ చెఫ్ రాజీవ్ గోయల్ భారతీయ గ్యాస్ట్రోనమీపై మాట్లాడారు. జపాన్‌కు చెందిన చెఫ్ తకమాసా ఒసావా బిర్యానీ యొక్క ప్రపంచవ్యాప్త సాంస్కృతిక ప్రాముఖ్యతను వివరించారు. యశోద హాస్పిటల్స్ లివర్ స్పెషలిస్ట్ డాక్టర్ నవీన్ పొలవరపు ఆహారం, నీటి ద్వారా వచ్చే వ్యాధులపై ప్రెజెంటేషన్ ఇచ్చారు. అనంతరం క్యులినరీ రంగానికి తెరవెనుక ఉండి సేవ చేసిన వారికి 'తెలంగాణ క్యులినరీ అన్‌సంగ్ హీరోస్ అవార్డ్స్', శిక్షకులకు 'క్యులినరీ గైడింగ్ స్టార్ అవార్డ్స్', విద్యాసంస్థల అధిపతులకు 'టీసీఏ అకడమిక్ కాంట్రిబ్యూషన్ అవార్డ్స్' అందజేశారు. ఈవెనింగ్ సెషన్‌కు ఐఏఎస్ అధికారి జయేష్ రంజన్‌తో పాటు పరిశ్రమల అధినేతలు హాజరై హాస్పిటాలిటీ రంగంలో సాంకేతికత, స్థిరత్వంపై చర్చించారు. అనంతరం 7వ వార్షికోత్సవ కేక్ కటింగ్, నెట్‌వర్కింగ్ డిన్నర్‌తో ఈ వేడుకలు విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో టీసీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు చెఫ్ ధర్మేందర్ లాంబా, జనరల్ సెక్రటరీ చెఫ్ నవీన్ నాగరాజ్, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రమేష్ రెడ్డి, తాజ్ డెక్కన్ జీఎం అర్నాబ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# మహారాష్ట్రలో భారీ వర్షాల బీభత్సం.. 16 మంది మృతి, రెడ్ అలర్ట్ జారీ

**బలగం టీవి, ముంబై**

మహారాష్ట్రలో గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా మరణాల సంఖ్య 16కు చేరింది. ముంబై, పుణె, థానే, పాల్ఘర్, రాయ్‌గఢ్ జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. భారీ వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగిపడటంతో జనజీవనం అస్తవ్యస్తమైంది.

పుణె జిల్లా మావల్ తహసీల్‌లోని పటాన్ గ్రామంలో తెల్లవారుజామున కొండచరియలు విరిగిపడటంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. ముంబై శివార్లలో చెట్లు కూలడం, వరద నీటిలో కొట్టుకుపోవడం వంటి ఘటనల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. ముంబైలోని మాన్‌ఖుర్ద్ ప్రాంతంలో మూడంతస్తుల భవనం కూలిపోవడంతో ఆరుగురు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షాల కారణంగా ముంబై--పుణె ఎక్స్‌ప్రెస్‌వే, ముంబై--గోవా జాతీయ రహదారిపై పలు చోట్ల కొండచరియలు విరిగిపడటంతో రాకపోకలు నిలిచిపోయాయి. రైల్వే ట్రాక్‌లపై వరద నీరు చేరడంతో ముంబై--పుణె మార్గంతో పాటు పశ్చిమ రైల్వే పరిధిలో పలు రైళ్లను అధికారులు రద్దు చేశారు.లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ముంబై, థానే జిల్లాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు.

భారత వాతావరణ శాఖ (ఐఎండీ) రాబోయే రెండు రోజుల పాటు మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరిస్తూ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని సూచించింది.

# డబుల్ మర్డర్ కేసులో నిందితుడికి జీవిత ఖైదు...

**-నేరం చేసిన వారు శిక్ష నుండి తప్పించుకోలేరు**

**-ఎస్పీ మహేష్ బి. గితే.**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

గంబిరావుపేట పోలీస్ స్టేషన్ లో నమోదైన రెండు హత్య కేసులో నిందుతుడికి యావజ్జీవకారాగార (జీవితఖైదు) శిక్ష, విధించినట్లు మంగళవారం సిరిసిల్ల జిల్లా ప్రధానన్యాయమూర్తి నీరజ తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ మహేష్ బి. గితే ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన వంగా సందీప్ రెడ్డి భూ వివాదాల నేపథ్యంలో ఇద్దరిని దారుణంగా హత్య చేశాడని తెలిపారు.2018 మార్చి 17న బీనబోయిన దేవయ్యను కత్తితో దాడి చేసి చంపగా, 2022 జూలై 31న మాన్నె నరసింహులును గొడ్డలితో దాడి చేసి హతమార్చాడని అన్నారు.గంభీరావుపేట పోలీసులు కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టి నిందితుడిని రిమాండ్‌కు తరలించి, అనంతరం కోర్టులో చార్జిషీట్లు దాఖలు చేశారని అన్నారు.?కోర్టు విచారణలో భాగంగా అదనపు ఎస్పీ చంద్రయ్య పర్యవేక్షణలో పోలీసులు పక్కా సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించాగా,ప్రాసిక్యూషన్ తరపున అప్పటి పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంటా శ్రీనివాస్ వాదనలు వినిపించగా, శాస్త్రీయ మరియు సాంకేతిక సాక్ష్యాలను పరిగణనలోకి తీసుకున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిందితుడికి యావజ్జీవకారాగార శిక్షను ఖరారు చేశారని అన్నారు.సమాజంలో నేరం చేసిన వారు ఎంతటివారైనా శిక్ష నుండి తప్పించుకోలేరని స్పష్టం చేశారు. పోలీసుల వ్యూహాత్మక దర్యాప్తు, ప్రాసిక్యూషన్ సమన్వయంతోనే నిందితుడికి శిక్ష పడిందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి కేసుల్లో కఠినమైన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.నేరస్తులకు శిక్ష పడేలా చొరవ చూపిన అదనపు ఎస్పీ చంద్రయ్య, అప్పటి పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంటా శ్రీనివాస్, డీఎస్పీ నాగేంద్రచారి, మరియు సిఐ లు మొగిలి, బన్సీలాల్, వెంకటేష్, కోర్ట్ మానిటరింగ్ ఎస్.ఐ రవీందర్ నాయుడు, కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్, గంభీరావుపేట ఎస్ఐ శ్రీకాంత్,కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్ లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



# నకిలీ విత్తనాలు అమ్మినా.. రవాణా చేసిన కఠిన చర్యలు తప్పవు...

**-నకిలీ విత్తనాల విక్రయాలలో తరచూ కేసులు నమోదైతే పీడీ యాక్ట్ అమలు.**

**- ఎస్పీ మహేష్ బి.గితే.**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

నకిలీ విత్తనాలను విక్రయించినా,రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని,తరచూ ఇటువంటి కేసుల్లో పట్టుబడే వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామని ఎస్పీ మహేష్ బి.గితే హెచ్చరించారు.

మంగళవారం పోలీస్,వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో స్పెషల్ టీమ్ లు ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించినారు.ఎరువుల,విత్తనాల,పురుగుమందుల స్టాక్ రిజిస్టర్స్, విక్రయ రికార్డులు, లైసెన్సులు, నిల్వలు,బిల్ రసీదులను పరిశీలించి మొదలగు అంశాలపై ఆరా తీశారు.ఈసందర్భంగా ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ జిల్లాలో నకిలీ విత్తనాల అక్రమ రవాణా, విక్రయాలను అడ్డుకోవడానికి, పోలీస్ , వ్యవసాయఅధికారులచే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించడం జరిగిందిన్నారు.గతంలో నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, వారియొక్క కదలికలను ఎప్పటికప్పుడు గమనించడం జరుగుతుందని,నకిలీ విత్తనాలు కలిగి ఉన్నా, అమ్మిన,రవాణా చేసిన వ్యక్తుల పై పీడీ యాక్ట్ చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందన్నారు.

రాబోవు నెల రోజులు చాలా కీలకమని జిల్లాలో ఒక్క రైతుకు కూడా నకిలీ విత్తనాలతో మోసపోకుండా చూసే బాధ్యత వ్యవసాయ అధికారులు పోలీసు అధికారులు పై ఉంటుందని,జిల్లాలో ఉన్న ఫర్టిలైజర్ షాప్, సీడ్స్ షాప్స్ పై నిఘా ఉంచి నకిలీ విత్తనాల విక్రయాలను, రవాణాను అరికట్టడం జరుగుతుందన్నారు.రైతులు సీడ్స్ అండ్ ఫెర్టిలైజర్స్ షాప్ నుండి విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పకుండా బిల్ తీసుకోవాలని సూచించారు.జిల్లా ప్రజలకు, రైతులకు ఎవరైనా నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుల మందులు అమ్ముతున్నారని సమాచారం ఉంటే పోలీస్ వారికి సమాచారం అందించాలని సూచించారు.




# ఎరువులు మరియు విత్తనాల దుకాణాల్లో తనిఖీలు

**బలగం టీవీ, బోయినిపల్లి;**

రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసు అధికారి, రాజన్న సిరిసిల్ల వారి ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ విత్తనాల విక్రయాల నివారణలో భాగంగా ఏఎస్సై కె. గంగరాజు మరియు మండల వ్యవసాయ అధికారి కె. ప్రణీత సంయుక్తంగా ఎరువులు, విత్తనాల దుకాణాల్లో మంగళవారం రోజున తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా బూర్గుపల్లి గ్రామంలోని కల్లెపల్లి చంద్రయ్య ఎరువుల దుకాణం, మదురవెల్లి జాన్ ఎరువుల దుకాణం, కొదురుపాక గ్రామంలోని ఓం సాయి ఫర్టిలైజర్స్ షాప్ మరియు సీఎస్ఈ వీఎల్ఈ సొసైటీలను తనిఖీ చేయగా, ఎక్కడా నకిలీ విత్తనాలు లేదా అనుమానాస్పద నిల్వలు గుర్తించబడలేదని, అన్ని రికార్డులను పరిశీలించినట్లు ప్రణీత తెలిపారు.ఈ విషయాన్ని వేములవాడ రూరల్ సీఐ ఎం. శ్రీనివాస్ తెలిపారు.



# వర్షాల కోసం గిరిజనుల ప్రార్థనలు..

**- ఘనంగా సీత్లా భవాని వేడుకలు..**

**- రుద్రంగి మండలంలోని రూప్లా నాయక్ తండా, జ్యోతి నాయక్ తండాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహణ..**

**బలగం టీవీ, రుద్రంగి :**

వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, పశుసంపద అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షిస్తూ రుద్రంగి మండలంలోని రూప్లా నాయక్ తండా, జ్యోతి నాయక్ తండాల్లో గిరిజనుల ఆరాధ్య దైవమైన సీత్లా భవాని పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు.

ఉదయం నుంచే తండాల్లో భక్తి వాతావరణం నెలకొంది. ముందుగా పశువులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించిన అనంతరం వాటిని అడవిలోకి విడిచిపెట్టారు. అనంతరం గిరిజన మహిళలు, యువతులు సంప్రదాయ వస్త్రధారణలో నైవేద్యాలను తలపై మోసుకుంటూ డప్పు వాయిద్యాల నడుమ నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని సీత్లా భవాని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా రిటైర్డ్ ఏడీఈ లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ, గిరిజనుల సంప్రదాయాలకు ప్రతీకగా సీత్లా భవాని పండుగను ప్రతి ఏడాది నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పండుగ వల్ల వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండుతాయని, పశుసంపద వృద్ధి చెందడంతో పాటు గ్రామాల్లో సుఖశాంతులు నెలకొంటాయని గిరిజనుల విశ్వాసమన్నారు. ఈ ఆచారాలను భావితరాలకు అందించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భుక్య జవహర్ లాల్ నాయక్, ఉప సర్పంచ్ తిరుపతి నాయక్, రిటైర్డ్ ఏడీఈ లక్ష్మణ్ నాయక్, పూజారి నారాయణ నాయక్, అంబర్ సింగ్ నాయక్, బాంకట్ లాల్ నాయక్, నర్సింగ్ నాయక్, దేవా నాయక్, భూమా నాయక్, చందర్ నాయక్, మాజీ సర్పంచ్ రాజు, శర్మన్, గోవింద్ నాయక్, తిరుపతి తండా పెద్దమనుషులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ఫర్టిలైజర్ యాప్ ను సద్వినియోగం చేసుకోవాలి..

**-సాగు అవసరాలకు అనుగుణంగా బుకింగ్ చేసుకోవాలి**

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల :**



ఫర్టిలైజర్ యాప్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు.తంగళ్లపల్లి మండలం జిల్లెలలోని గ్రోమోర్, నేరేళ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో ఎంత యూరియా ఉంది,ఎంత వచ్చింది,ఫర్టిలైజర్ యాప్ ద్వారా రైతులు బుకింగ్ చేసుకున్న వివరాలు మొబైల్, రిజిస్టర్ లో పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో యూరియా నిల్వలను తనిఖీ చేశారు.పీఏసీఎస్ లో రైతులు యూరియా తీసుకువెళ్లేందుకు రాగా, వారితో జిల్లా కలెక్టర్ మాట్లాడారు.ఎక్కడి నుంచి వచ్చారు,ఎన్ని ఎకరాల భూమి ఉంది,ఏ ఏ పంటలు సాగు చేస్తున్నారు,ఫర్టిలైజర్ యాప్ వినియోగిస్తున్నారా సేవలు ఎలా ఉన్నాయో వారిని అడిగి తెలుసుకున్నారు.క్యూలో నిలబడే ఇబ్బందులు దూరం అయ్యాయని, ఎప్పుడైనా తమకు నచ్చిన షాప్ లో తీసుకునే అవకాశం ఉందని రైతులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రైతుల కోసం ప్రభుత్వం రూపొందించిన ఫర్టిలైజర్ యాప్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. రైతులు తమకు నచ్చిన, అందుబాటులో ఉన్న షాప్ నుంచి యూరియా కొనుగోలు చేయవచ్చని స్పష్టం చేశారు. జిల్లాలో ఎరువులకు కొరత లేదని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పంటలు సాగు చేయాలని సూచించారు. ఆయిల్ పామ్ ఇతర పంటల వైపు దృష్టి సారించాలని పేర్కొన్నారు.పరిశీలనలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, వ్యవసాయ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# రెవెన్యూ అధికారులు సమయ పాలన పాటించాలి..



**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

రెవెన్యూ అధికారులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.తంగళ్లపల్లి మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బంది హాజరు రిజిస్టర్ పరిశీలించారు. మొత్తం సిబ్బంది ఎందరు ఉన్నారు అని ఆరా తీశారు. కార్యాలయంలో పరిశీలించారు. భూ భారతి, సాదాబైనామా దరఖాస్తులపై ఆరా తీశారు. పలు దరఖాస్తులు పరిశీలించారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది విధులకు సమయానికి రావాలని సూచించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆదేశించారు. భూ భారతి, సాదాబైనామా కింద వచ్చిన దరఖాస్తులను పరిశీలించి,నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని తెలిపారు. కార్యాలయంలోని అన్ని ఫైళ్లను జాగ్రతగా భద్రపరచాలని, ఆవరణ అంతా పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో ఇంచార్జి తహసీల్దార్ మురళి సిబ్బంది తదితరులు ఉన్నారు

# వర్షాకాల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి..

**- డిఎంహెచ్వో డాక్టర్ జి.ఎంజేలా అల్ఫ్రేడ్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



వర్షాకాల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిఎంహెచ్వో డాక్టర్ జి.ఎంజేలా అల్ఫ్రేడ్ అన్నారు.ఎల్లారెడ్డిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశా డే సమావేశానికి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.ఎంజేలా అల్ఫ్రేడ్ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడుతూ, స్థానిక ప్రజలందరూ ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్య కేంద్ర సిబ్బంది తమకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంతో పాటు, కార్యాలయ వేళల్లో సమయపాలన తప్పనిసరిగా పాటించాలని అన్నారు.

ప్రస్తుతం మారుతున్న వాతావరణ పరిస్థితులు, వ్యక్తిగత మరియు పరిసరాల పరిశుభ్రత లోపించడం వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ క్రమంలో పంచాయతీ, గ్రామీణ నీటి సరఫరా, మరియు గ్రామీణ అభివృద్ధి శాఖలు సమన్వయంతో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, అయితే ఈ ప్రక్రియలో ప్రజలందరూ భాగస్వాములై సహకరించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా రాబోయే వర్షాకాలంలో నీటి ద్వారా మరియు దోమల ద్వారా వ్యాపించే అతిసార, పచ్చకామెర్లు, గ్యాస్ట్రో ఎంటరైటిస్, మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, ఫైలేరియా మరియు మెదడు వాపు వంటి వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆశా కార్యకర్తలు తమకు కేటాయించిన గ్రామాలలో క్రమం తప్పకుండా గృహ సందర్శనలు చేస్తూ, ప్రజల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకోవాలని, అవసరమైన వారికి సలహాలు, సూచనలు అందించడంతో పాటు మందులను అందజేయాలని సూచించారు.దోమల నివారణపై అవగాహన కల్పిస్తూ, ఎనాఫిలిస్ మరియు క్యూలెక్స్ దోమలు మురికి గుంటలు, సెప్టిక్ ట్యాంక్ లలో వృద్ధి చెందుతాయని, అదేవిధంగా ఏడిస్ దోమలు ఇళ్లలోని నిల్వ ఉండే కొద్దిపాటి నీటిలో కూడా పెరుగుతాయని ఆమె వివరించారు. పగటిపూట కుట్టే ఏడిస్ దోమల వల్ల వచ్చే డెంగ్యూ వ్యాధిని ఎలిసా టెస్ట్ ద్వారా నిర్ధారించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ వారానికి ఒక రోజును 'డ్రైడే'గా పాటించాలని, వంట పాత్రలు, నీటి డ్రమ్ములు మరియు నిల్వ ఉంచే ఇతర పాత్రలను ఖాళీ చేసి, తోమి ఆరబెట్టడం ద్వారా దోమలు గుడ్లు పెట్టకుండా, లార్వా పెరగకుండా చూడవచ్చని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ నాగేంద్ర బాబు, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ రామ్ రెడ్డితో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం వినూత్న నిరసన..



**-బూట్ పాలిష్ చేస్తూ బీఆర్ఎస్వీ ఆందోళన.**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక పాత బస్టాండ్ వద్ద బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో విద్యార్థులు బూట్ పాలిష్ చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా

బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ, ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా విస్మరించడం దారుణమని మండిపడ్డారు. ప్రభుత్వం ఏర్పడి 28 నెలలు గడిచినప్పటికీ, విద్యార్థులకు అందాల్సిన నిధులను విడుదల చేయకపోవడం పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఫీజులు చెల్లించలేక పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విద్యాభ్యాసాన్ని కొనసాగించేందుకు చాలామంది పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేయాల్సిన దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

తక్షణమే బకాయిలను విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడితే సహించేది లేదని, విద్యార్థులందరినీ ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాడుతామని అన్నారు . ఈ నిరసన కార్యక్రమంలో మచ్చే శ్రీనివాస్, సదుల శేఖర్, బాల్యాల ప్రవీణ్, బక్కని వేణు యాదవ్, దడికే రాజు, రాజేష్, అదిల్, యశ్వంత్, ఎండి అమన్, వంశీ, లోకేష్ మరియు ఎండి జుమీర్ తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీనిధి రుణాల పంపిణీ, రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**గామీణాభివృద్ధి శాఖ అధికారులు, మండల ఏపీఎంలతో సమీక్ష**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

స్త్రీనిధి రుణాల పంపిణీ, రికవరీ, మన స్త్రీనిధి యాప్ వినియోగం రుణాల దుర్వినియోగం, మోసాలపై కఠిన చర్యలు తీసుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. స్త్రీనిధి ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలకు అందిస్తున్న రుణాల పంపిణీ, రికవరీ, రుణాల దుర్వినియోగంపై తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, మండల ఏపీఎంలతో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక సాధికారతకు స్త్రీనిధి తోడ్పడుతుందని, సంఘాలకు అవసరమైన రుణాలు సకాలంలో అందేలా చూడడంతో పాటు, మండలాల వారీగా పనితీరు నిరంతరం సమీక్షిస్తూ లక్ష్యాల సాధనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, మహిళల ఆర్థికాభివృద్ధికి స్త్రీనిధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.

జిల్లాకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.113 కోట్ల వార్షిక రుణ లక్ష్యం కేటాయించబడిందని, లక్ష్య సాధనలో వెనుకబడిన మండలాలపై ప్రత్యేక దృష్టి సారించి, అర్హత కలిగిన స్వయం సహాయక సంఘాలను గుర్తించి వేగంగా రుణాలు మంజూరు చేయాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో రికవరీ శాతాన్ని పెంచడంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జీరో రికవరీ ఉన్న స్వయం సహాయక సంఘాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. సంబంధిత మండల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సంఘాలతో సమావేశాలు నిర్వహించి, బకాయిల వసూళ్లపై అవగాహన కల్పించాలని సూచించారు. రుణాల దుర్వినియోగం, మోసాలకు సంబంధించిన కేసులపై నిర్లక్ష్యం ప్రదర్శించకుండా, చట్టపరమైన చర్యలు తీసుకుని, వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాల ఉత్పత్తి, గొర్రెల పెంపకం, బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీ, మదర్ యూనిట్లు, క్యాంటీన్లు, పీఎంఎఫ్ఎంఈ, గృహ మరమ్మతులు, రూఫ్‌టాప్ సోలార్, ఈ-బైక్‌లు, ఈ-ఆటోలు వంటి జీవనోపాధి కార్యక్రమాలకు అర్హులైన సంఘాలను ప్రోత్సహించి మరింత మందికి రుణాలు అందేలా చూడాలని సూచించారు.మన స్త్రీనిధి మొబైల్ యాప్ వినియోగాన్ని విస్తృతం చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి స్వయం సహాయక సంఘ సభ్యురాలు యాప్‌ను వినియోగించేలా అవగాహన కల్పించాలని, యాప్ ద్వారా రుణ వివరాలు, ఈఎంఐలు, చెల్లింపులు, పొదుపు వివరాలు, బీమా సమాచారం తదితర సేవలను సులభంగా పొందవచ్చని తెలిపారు.


# టీమిండియాకు ఘోర పరాభవం.

- ఇంగ్లండ్ చేతిలో 125 పరుగుల తేడాతో ఓటమి!
- బౌలింగ్ తర్వాత బ్యాటింగ్‌లోనూ ఫ్లాప్..
- టీ20 చరిత్రలోనే అత్యంత భారీ ఓటమి..
- సిరీస్‌లో 2-0తో ఇంగ్లండ్ ఆధిక్యం



**బలగం టీవి, నాటింగ్‌హమ్**

టీ20 వరల్డ్‌కప్ నెగ్గిన తర్వాత కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో బరిలోకి దిగిన భారత యువ జట్టు వరుస పరాజయాలతో చెత్తాటతో నిరాశపరుస్తోంది. ఐర్లాండ్ చేతిలో వైట్‌వాష్ అయిన తర్వాత ఇంగ్లండ్ గడ్డపై అడుగుపెట్టిన అయ్యర్‌సేన వరుసగా రెండో ఓటమిని ఖాతాలో వేసుకుంది. గత పోరులో బౌలింగ్‌లో విఫలమైన భారత్, ఈసారి పేలవ బ్యాటింగ్‌తో అంతర్జాతీయ టీ20ల చరిత్రలోనే అతి పెద్ద పరాజయంతో తలదించుకుంది. మంగళవారం రాత్రి జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో ఇంగ్లండ్ 125 పరుగుల భారీ తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. షార్ట్ ఫార్మాట్‌లో పరుగుల పరంగా భారత్‌కు ఇదే అత్యంత భారీ ఓటమి. అంతకుముందు 2019లో వెల్లింగ్టన్‌లో న్యూజిలాండ్ చేతిలో 80 పరుగుల తేడాతో ఓడిన రికార్డు ఉండగా.. ఇప్పుడు మెన్ ఇన్ బ్లూ మరింత చెత్త రికార్డును మూటగట్టుకుంది.



**76 పరుగులకే కుప్పకూలిన భారత్!**

ఇంగ్లండ్ నిర్దేశించిన 202 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో టీమిండియా బ్యాటర్లు చేతులెత్తేశారు. ఇంగ్లిష్ పేసర్లు జోష్ టంగ్ (4/28), జోఫ్రా ఆర్చర్ (3/29) ధాటికి భారత టాప్, మిడిలార్డర్ పూర్తిగా కుదేలైంది. కేవలం 11.4 ఓవర్లలోనే 76 పరుగులకే భారత్ ఆలౌట్ అయ్యింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ (10), వైభవ్ సూర్యవంశీ (13)తో పాటు ఇషాన్ కిషన్ (13), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (5), అక్షర్ పటేల్ (10), తిలక్ వర్మ (3), శివం దూబే (2) పెవిలియన్‌కు క్యూ కట్టడంతో జట్టుకు ఘోర పరాభవం తప్పలేదు.

**సాల్ట్ మెరుపులు.. బౌలర్లు ఫర్వాలేదు**

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 201 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (44 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 70) హాఫ్ సెంచరీతో చెలరేగగా.. ఆల్‌రౌండర్ సామ్ కరన్ (41 నాటౌట్), కెప్టెన్ జోస్ బట్లర్ (36) మెరుపు ఇన్నింగ్స్ ఆడారు. భారత బౌలర్లలో యువ ఆటగాళ్లు ప్రిన్స్ యాదవ్, హర్షిత్ రాణా చెరో రెండు వికెట్లు తీసి పర్వాలేదనిపించారు. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల ఈ టీ20 సిరీస్‌లో ఇంగ్లండ్ 2-0తో స్పష్టమైన ఆధిక్యంలో నిలిచింది. ఇరు జట్ల మధ్య నాలుగో టీ20 మ్యాచ్ గురువారం జరగనుంది.

**స్కోరు బోర్డు:**

ఇంగ్లండ్: 20 ఓవర్లలో 201/7 (ఫిల్ సాల్ట్ 70, సామ్ కరన్ 41 నాటౌట్; ప్రిన్స్ 2/వికెట్లు, హర్షిత్ 2/వికెట్లు)

భారత్: 11.4 ఓవర్లలో 76 ఆలౌట్ (సూర్యవంశీ 13, ఇషాన్ 13; జోష్ టంగ్ 4/28, జోఫ్రా ఆర్చర్ 3/29)

ఫలితం: ఇంగ్లండ్ 125 పరుగుల తేడాతో విజయం సాధించింది.



## ప్రపంచ ఛాంపియన్ అర్జెంటీనా 'తీన్‌మార్'..

**ఈజిప్ట్‌పై సంచలన విజయం!**

**ఓటమి అంచుల్లోంచి పుంజుకుని క్వార్టర్స్‌కు మెస్సీసేన..**

**ఆఖరి నిమిషాల్లో 3 గోల్స్‌తో విశ్వరూపం..**

**గోల్డెన్ బూట్ రేసులో లియోనెల్ మెస్సీ టాప్**

**బలగం టీవి, హైదరాబాద్**

ప్రపంచ ఛాంపియన్ ఆట ఎలా ఉంటుందో అర్జెంటీనా మరోసారి నిరూపించింది. అసాధారణ పోరాట పటిమతో ఓటమి అంచుల్లోంచి పుంజుకొని క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకుంది. మంగళవారం రాత్రి అత్యంత ఉత్కంఠగా సాగిన ఫిఫా వరల్డ్‌కప్ ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో మెస్సీసేన 3-2 గోల్స్ తేడాతో ఈజిప్ట్‌ను ఓడించి ఊపిరిపీల్చుకుంది. మ్యాచ్‌లో ముప్పావు వంతు సమయం ఈజిప్ట్ 2-0తో తిరుగులేని ఆధిక్యంలో నిలిచినప్పటికీ.. ఆఖరి నిమిషాల్లో అర్జెంటీనా అద్భుత రికవరీతో వరుసగా మూడు గోల్స్ కొట్టి సంచలన విజయాన్ని నమోదు చేసింది. అర్జెంటీనా తరపున క్రిస్టియానో రోమెరో (79వ నిమిషం), కెప్టెన్ లియోనెల్ మెస్సీ (83వ నిమిషం), ఎంజో ఫెర్నాండెజ్ (90౦3వ నిమిషం) గోల్స్ చేసి జట్టును గట్టెక్కించారు. ఈ టోర్నీలో 8వ గోల్ కొట్టిన మెస్సీ గోల్డెన్ బూట్ రేసులో ముందంజలో ఉన్నాడు.

**మెస్సీ పెనాల్టీ మిస్.. ఈజిప్ట్ 'డబుల్' ధమాకా**

మ్యాచ్ ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించిన ఈజిప్ట్.. 15వ నిమిషంలోనే యాసిర్ ఇబ్రహీం హెడర్ గోల్‌తో ఖాతా తెరిచింది. అయితే 21వ నిమిషంలో అర్జెంటీనాకు పెనాల్టీ రూపంలో సువర్ణావకాశం లభించినా మెస్సీ దాన్ని మిస్ చేశాడు. అతని షాట్‌ను ఈజిప్ట్ గోల్‌కీపర్ షోబీర్ అద్భుతంగా అడ్డుకున్నాడు. మెస్సీ పెనాల్టీ మిస్ చేయడం ఈ టోర్నీలో ఇది రెండోసారి. తొలి సగంలో అర్జెంటీనాకు నిరాశే మిగలగా, సెకండాఫ్‌లోనూ ఈజిప్ట్ జోరు తగ్గలేదు. 67వ నిమిషంలో మహమ్మద్ సలాహ్ అందించిన అద్భుత పాస్‌ను మోస్తఫా జికో గోల్‌గా మలిచి ఈజిప్ట్‌కు 2-0తో ఆధిక్యాన్ని అందించడంతో అర్జెంటీనా క్యాంప్‌లో తీవ్ర ఆందోళన నెలకొంది.

**సెకండాఫ్ బ్రేక్ తర్వాత మారిన ఆట..**

సెకండాఫ్ హైడ్రేషన్ బ్రేక్ తర్వాత అర్జెంటీనా తమలోని అసలైన ఛాంపియన్‌ను నిద్రలేపింది. తీవ్ర ఒత్తిడిలోనూ కెప్టెన్ మెస్సీ తనదైన శైలిలో అటాకింగ్ గేమ్ ఆడాడు. 79వ నిమిషంలో మెస్సీ ఇచ్చిన అద్భుత క్రాస్‌ను రోమెరో హెడర్‌తో గోల్‌గా మార్చడంతో అర్జెంటీనా ఆశలు చిగురించాయి. ఆ తర్వాత కేవలం నాలుగు నిమిషాల వ్యవధిలోనే (83వ నిమిషం) మోంటినెల్ ఇచ్చిన పాస్‌ను మెస్సీ ఒడుపుగా గోల్ పోస్ట్‌లోకి నెట్టడంతో స్కోరు 2-2తో సమం అయింది.

**ఇంజూరీ టైమ్‌లో ఎంజో 'విన్నింగ్' హెడర్**

మ్యాచ్ ముగియడానికి లభించిన 7 నిమిషాల ఇంజూరీ టైమ్ మొదలైన వెంటనే ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఈ క్రమంలో అర్జెంటీనా ప్లేయర్ మార్టినెజ్ అందించిన క్రాస్‌ను ఎంజో ఫెర్నాండెజ్ అద్భుత తలతో (హెడర్) గోల్‌గా మార్చడంతో అర్జెంటీనా 3-2తో విజయాన్ని ఖాయం చేసుకుంది. ఫైనల్ విజిల్ ముగిసిన వెంటనే ఈ ఉత్కంఠ భరిత విజయానందంలో కెప్టెన్ మెస్సీ కన్నీళ్లు పెట్టుకోవడం మైదానంలో హైలైట్‌గా నిలిచింది.

**మ్యాచ్ స్కోరు బోర్డు:**

అర్జెంటీనా: 3 (రోమెరో 79వ ని, మెస్సీ 83వ ని, ఎంజో ఫెర్నాండెజ్ 90౦3వ ని)

ఈజిప్ట్: 2 (యాసిర్ ఇబ్రహీం 15వ ని, మోస్తఫా జికో 67వ ని)

ఫలితం: అర్జెంటీనా 3-2 తేడాతో విజయం సాధించి క్వార్టర్స్‌కు చేరింది.

# ప్లేఆఫ్స్‌కు కరీంనగర్, రంగారెడ్డి..





**టీజీ20 లీగ్ లో ప్లే ఆఫ్స్ బెర్తులు ఖరారు**

**రన్‌రేట్ ఆధారంగా నాకౌట్‌కు చేరిన జట్లు..**

**నల్గొండ అవుట్!**

**బలగం టీవి, హైదరాబాద్**

పాలమూరు, వరంగల్‌లకు ఘోర పరాజయాలుహైదరాబాద్, ఆట ప్రతినిధి (జూలై 7): టీజీ20 లీగ్‌లో నాకౌట్ రేసు ఉత్కంఠభరితంగా ముగిసింది. ప్లేఆఫ్స్‌లో నిలవాలంటే తప్పక నెగ్గాల్సిన చావోరేవో మ్యాచ్‌ల్లో కరీంనగర్ డైమండ్స్, రంగారెడ్డి రైజర్స్ జట్లు అద్భుత సత్తాచాటాయి. మంగళవారం ఉప్పల్ వేదికగా జరిగిన వేర్వేరు మ్యాచ్‌ల్లో ఈ జట్లు తమ ప్రత్యర్థులపై భారీ విజయాలను నమోదు చేసి అధికారికంగా ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించాయి. కాగా, లీగ్ దశ ముగిసేసరికి కరీంనగర్, నల్లగొండ, రంగారెడ్డి జట్లకు తలా 8 పాయింట్లే ఉన్నప్పటికీ.. మెరుగైన నెట్ రన్‌రేట్ ఆధారంగా కరీంనగర్, రంగారెడ్డి జట్లు నాకౌట్‌కు దూసుకెళ్లగా, నల్గొండ నైట్స్ లీగ్ నుంచి నిష్క్రమించింది. వరంగల్‌పై 'రంగారెడ్డి' రికార్డు విజయం!మంగళవారం ఉప్పల్ మైదానంలో జరిగిన రెండో మ్యాచ్‌లో రంగారెడ్డి రైజర్స్ బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో విశ్వరూపం ప్రదర్శించింది. వరంగల్ వారియర్స్‌తో జరిగిన ఈ ఏకపక్ష పోరులో రంగారెడ్డి ఏకంగా 161 పరుగుల భారీ తేడాతో ప్రత్యర్థిని దారుణంగా ఓడించింది. ఈ భారీ విజయంతో తమ రన్‌రేట్‌ను అమాంతం పెంచుకుని ప్లేఆఫ్స్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. పాలమూరును చిత్తు చేసిన కరీంనగర్

అంతకుముందు జరిగిన మొదటి కీలక మ్యాచ్‌లో కరీంనగర్ డైమండ్స్ జట్టు 73 పరుగుల తేడాతో పాలమూరు స్ట్రైకర్స్‌ను చిత్తుచేసింది. కరీంనగర్ నిర్దేశించిన లక్ష్య ఛేదనలో పాలమూరు జట్టు చేతులెత్తేయడంతో డైమండ్స్ ఘన విజయం సాధించి నాకౌట్ రేసులో నిలిచింది. ఈ రెండు మ్యాచ్‌ల ఫలితాలతో లీగ్ పట్టికలో సమీకరణాలు మారిపోయి, నల్గొండ ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. పాయింట్ల పట్టిక (టాప్-4 జట్లు): హైదరాబాద్ - 14 పాయింట్లు (ప్లేఆఫ్స్)కరీంనగర్ డైమండ్స్ - 8 పాయింట్లు (మెరుగైన రన్‌రేట్‌తో ప్లేఆఫ్స్) రంగారెడ్డి రైజర్స్ - 8 పాయింట్లు (మెరుగైన రన్‌రేట్‌తో ప్లేఆఫ్స్) నల్లగొండ నైట్స్ - 8 పాయింట్లు (తక్కువ రన్‌రేట్ కారణంగా అవుట్)



## నెట్స్‌లో కుప్పకూలిన వైభవ్ సూర్యవంశీ!

**ఛాతికి బలంగా తాకిన త్రోడౌన్ బంతి..**

**బలగం టీవి, హైదరాబాద్**

భారత క్రికెట్ సరికొత్త సంచలనం, 15 ఏళ్ల యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ గాయపడ్డాడు. ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా బుధవారం జరగనున్న కీలకమైన మూడో మ్యాచ్‌కు ముందు నెట్స్ ప్రాక్టీస్‌లో ఈ దురదృష్టకర సంఘటన చోటుచేసుకుంది. నెట్స్‌లో బ్యాటింగ్ సాధన చేస్తుండగా ఒక బంతి అతని ఛాతికి బలంగా తాకడంతో తీవ్ర నొప్పితో వైభవ్ ఒక్కసారిగా పిచ్‌పైనే కుప్పకూలాడు.


టీమిండియా త్రోడౌన్ స్పెషలిస్ట్ రాఘవేంద్ర ద్వివేది (రఘు) గంటకు దాదాపు 150 కిలోమీటర్ల వేగంతో విసిరిన బంతిని అంచనా వేయడంలో వైభవ్ విఫలమయ్యాడు. బ్యాట్‌ను ముందే స్వింగ్ చేయడంతో మిస్సైన బంతి నేరుగా వచ్చి అతని ఛాతి భాగానికి తాకింది. వెంటనే అప్రమత్తమైన టీమిండియా ఫిజియోలు మైదానంలోకి పరుగెత్తుకెళ్లి ప్రాథమిక చికిత్స అందించారు. ప్రస్తుతం వైద్య బృందం అతన్ని నిరంతరం పర్యవేక్షిస్తోంది. తాకిన త్రోడౌన్ బంతి.. ఇంగ్లండ్‌తో మూడో టీ20కి ముందు భారత్‌కు భారీ షాక్!భారత క్రికెట్ సరికొత్త సంచలనం, 15 ఏళ్ల యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ గాయపడ్డాడు. ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా బుధవారం జరగనున్న కీలకమైన మూడో మ్యాచ్‌కు ముందు నెట్స్ ప్రాక్టీస్‌లో ఈ దురదృష్టకర సంఘటన చోటుచేసుకుంది. నెట్స్‌లో బ్యాటింగ్ సాధన చేస్తుండగా ఒక బంతి అతని ఛాతికి బలంగా తాకడంతో తీవ్ర నొప్పితో వైభవ్ ఒక్కసారిగా పిచ్‌పైనే కుప్పకూలాడు.

టీమిండియా త్రోడౌన్ స్పెషలిస్ట్ రాఘవేంద్ర ద్వివేది (రఘు) గంటకు దాదాపు 150 కిలోమీటర్ల వేగంతో విసిరిన బంతిని అంచనా వేయడంలో వైభవ్ విఫలమయ్యాడు. బ్యాట్‌ను ముందే స్వింగ్ చేయడంతో మిస్సైన బంతి నేరుగా వచ్చి అతని ఛాతి భాగానికి తాకింది. వెంటనే అప్రమత్తమైన టీమిండియా ఫిజియోలు మైదానంలోకి పరుగెత్తుకెళ్లి ప్రాథమిక చికిత్స అందించారు. ప్రస్తుతం వైద్య బృందం అతన్ని నిరంతరం పర్యవేక్షిస్తోంది.

# ముగిసిన రోనాల్డో స్వర్ణ యుగం.

**పోర్చుగల్‌పై విజయంతో క్వార్టర్స్‌లోకి స్పెయిన్!లి**

**91వ నిమిషంలో మెరినో మెరుపు గోల్.. 2010 తర్వాత తొలిసారి క్వార్టర్ ఫైనల్లోకి మాజీ ఛాంపియన్**



**బలగం టీవి, టెక్సాస్:**

ఫిఫా వరల్డ్‌కప్ నుంచి పోర్చుగల్ జట్టు నిష్క్రమించింది. ఉత్కంఠభరితంగా సాగిన రౌండ్-16 నాకౌట్ మ్యాచ్‌లో స్పెయిన్ 1-0 గోల్స్ తేడాతో పోర్చుగల్‌పై విజయం సాధించింది. దీంతో సూపర్‌స్టార్ క్రిస్టియానో రోనాల్డో అంతర్జాతీయ ప్రపంచకప్ కెరీర్‌కు విషాదాంత ముగింపు లభించింది. శుక్రవారం కాలిఫోర్నియాలో జరగబోయే హై-వోల్టేజ్ క్వార్టర్ ఫైనల్ పోరులో స్పెయిన్ జట్టు బెల్జియంతో తలపడనున్నది.

ఫస్ట్ హాఫ్‌లో ఇరు జట్లు రక్షణాత్మక ధోరణి వీడి తీవ్రంగా పోరాడాయి. స్పెయిన్ తరపున మైఖేల్ ఒయర్‌జబాల్ ప్రత్యర్థి గోల్ పోస్టుపై మెరుపు దాడులు చేయగా, పోర్చుగల్ కెప్టెన్ క్రిస్టియానో రోనాల్డో కూడా అంతే దూకుడుగా అటాక్ చేశాడు. అయితే ఇరు జట్ల డిఫెండర్లు గట్టిగా నిలబడటంతో ప్రథమార్ధంలో ఒక్క గోల్ కూడా నమోదు కాలేదు. సెకండ్ హాఫ్‌లోనూ ఇరు జట్లు ఆచితూచి అడుగులు వేశాయి. అయితే ఎక్స్‌ట్రా టైమ్ (స్టా టైం) లో స్పెయిన్ కోచ్ మైదానంలోకి దించిన ఇద్దరు సబ్‌స్టిట్యూట్ ఆటగాళ్లు మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశారు. ఆట 91వ నిమిషంలో ఫెర్రన్ టోరస్ అందించిన అద్భుతమైన పాస్‌ను అందుకున్న మైఖేల్ మెరినో.. పోర్చుగల్ గోల్‌కీపర్ డియోగో కోస్టాను చాకచక్యంగా బీట్ చేస్తూ బంతిని నెట్ లోకి పంపాడు. ఈ ఒంటరి గోల్‌తో స్పెయిన్ విజయం ఖాయమైంది.



ఈ ప్రపంచకప్ టోర్నీలో స్పెయిన్ గోల్ కీపర్ ఉనై సిమన్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. టోర్నీలో ఇప్పటి వరకు ఏకంగా 609 నిమిషాల పాటు గోల్ కీపింగ్ చేసిన సిమన్, ప్రత్యర్థులకు ఒక్క గోల్ కూడా సమర్పించకుండా క్లీన్ షీట్ రికార్డును కొనసాగిస్తున్నాడు. ఈ మ్యాచ్‌కు ముందే ఇదే తన చివరి వరల్డ్‌కప్ అని క్రిస్టియానో రోనాల్డో ప్రకటించిన విషయం తెలిసిందే. మ్యాచ్ ముగిసేవరకు జట్టును ఆదుకునేందుకు రోనాల్డో తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ స్పెయిన్ రక్షణ శ్రేణిని ఛేదించలేకపోయాడు. ఈ ఓటమితో 41 ఏళ్ల రోనాల్డో ప్రపంచకప్ ప్రస్థానం ముగిసింది.

తన సుదీర్ఘ ప్రపంచకప్ కెరీర్‌లో రోనాల్డో 27 మ్యాచ్‌లు ఆడి 11 గోల్స్ చేశాడు. అయితే వరుసగా ఆరు వరల్డ్‌కప్స్‌లో గోల్స్ చేసిన ఏకైక ఆటగాడిగా ఆయన ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. అంతర్జాతీయ మ్యాచుల్లో 146 గోల్స్‌తో అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా ఉన్న రోనాల్డో.. ఈ టోర్నీలోనూ మూడు గోల్స్ సాధించి మెరిశాడు. 2010లో ప్రపంచ కప్ గెలిచిన తర్వాత స్పెయిన్ జట్టు మళ్లీ క్వార్టర్స్‌లోకి ప్రవేశించడం ఇదే తొలిసారి కావడం విశేషం.

## అమెరికాను చిత్తు చేసిన బెల్జియం!

**ఫిఫా ప్రపంచకప్ నుంచి ఆతిథ్య జట్టు అవుట్.. 4-1తో క్వార్టర్స్‌కు దూసుకెళ్లిన బెల్జియం**

**బలగం టీవి, హైదరాబాద్**



ఫిఫా ప్రపంచకప్ 2026 టోర్నీలో ఆతిథ్య అమెరికా పోరాటం ముగిసింది. అద్వితీయమైన ప్రదర్శనతో అగ్రరాజ్యం ప్రపంచకప్ కలలను బెల్జియం చిదిమేసింది. మంగళవారం తెల్లవారు జామున సీటెల్ స్టేడియంలో జరిగిన హోరాహోరీ ప్రీక్వార్టర్ పోరులో బెల్జియం 4-1 తేడాతో అమెరికాను చిత్తుగా ఓడించింది. బెల్జియం స్టార్ చార్లెస్ డి కెటెలెరే 'డబుల్ గోల్స్'తో పాటు ఒక అసిస్ట్‌తో చెలరేగి అమెరికా పతనాన్ని శాసించాడు. ఈ చారిత్రాత్మక విజయంతో బెల్జియం క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లగా.. అమెరికా కన్నీళ్లతో టోర్నీ నుంచి ఇంటిబాట పట్టింది.

ప్రపంచకప్ చరిత్రలో ఒకే మ్యాచ్‌లో 3 గోల్స్‌లో (2 గోల్స్, 1 అసిస్ట్) నేరుగా భాగస్వామ్యం పంచుకున్న తొలి బెల్జియం ఆటగాడిగా చార్లెస్ డి కెటెలెరే సరికొత్త రికార్డు సృష్టించాడు. మ్యాచ్ మొదలైన 46 సెకన్లలోనే బెల్జియం అటాకింగ్ గేమ్ మొదలుపెట్టింది. ఆట 9వ నిమిషంలోనే నికోలస్ రాస్కిన్ అందించిన లో-క్రాస్‌ను డి కెటెలెరే గోల్‌గా మలిచి బెల్జియంకు 1-0తో ఆధిక్యాన్ని అందించాడు. అయితే 30వ నిమిషంలో అమెరికా ప్లేయర్ మాలిక్ టిల్‌మన్ ఫ్రీ-కిక్ కొట్టగా.. అది బెల్జియం డిఫెండర్లకు తగిలి ఓన్ గోల్‌గా మారింది. దాంతో స్కోరు 1-1 తో సమమై అమెరికా అభిమానుల్లో ఆశలు చిగురించాయి. కానీ ఆ సంతోషం రెండు నిమిషాలు కూడా నిలవలేదు. 32వ నిమిషంలో ట్రోసార్డ్ అందించిన క్రాస్‌ను డి కెటెలెరే హెడర్ ద్వారా మళ్లీ గోల్ చేసి బెల్జియం ఆధిక్యాన్ని 2-1కి పెంచాడు.

సెకండాఫ్‌లో అమెరికా గోల్‌కీపర్ మాట్ ఫ్రీజ్ చేసిన ఘోర తప్పిదం మ్యాచ్‌ను పూర్తిగా బెల్జియం వైపు తిప్పేసింది. కీపర్ ఫ్రీజ్ నుంచి బంతిని చాకచక్యంగా లాక్కున్న డి కెటెలెరే, దానిని హన్స్ వనాకెన్‌కు అందించాడు. ఖాళీగా ఉన్న పోస్ట్‌ను చూసి వనాకెన్ దూరం నుంచి సులువుగా గోల్ చేయడంతో బెల్జియం 3-1 తో ముందంజ వేసింది. చివరి నిమిషాల్లో అమెరికా ఆటగాళ్లు బాలోగన్, బెర్హాల్టర్ సులువైన గోల్ అవకాశాలను వృథా చేశారు.

ఇక ఇంజూరీ టైమ్‌లో సబ్‌స్టిట్యూట్ ప్లేయర్ రొమేలు లుకాకు మరో క్లినికల్ గోల్ కొట్టడంతో అమెరికా 4-1 తో ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. క్వార్టర్ ఫైనల్లో బలమైన స్పెయిన్‌తో బెల్జియం తలపడనుంది.

అమెరికా జట్టు ప్రపంచకప్‌లో ప్రిక్వార్టర్స్‌కు చేరడం ఇది ఏడోసారి కాగా.. అందులో 6 సార్లు (2010, 2014, 2022, 2026 లతో కలిపి వరుసగా 4 సార్లు) ప్రిక్వార్టర్స్‌లోనే వెనుదిరగడం గమనార్హం. ఈ మ్యాచ్‌లో బెల్జియం 2.15 ఎక్స్‌పెక్టెడ్ గోల్స్ నమోదు చేయగా.. అమెరికా కేవలం 0.67 తో ఘోరంగా చేతులెత్తేసింది.

# సంజూ శాంసన్‌పై వేటు వింతగా ఉంది.. సెలెక్టర్ల తీరుపై రహానే ఆశ్చర్యం!

**బలగం టీవి, హైదరాబాద్**



జింబాబ్వే పర్యటనకు ప్రకటించిన భారత టీ20 జట్టు నుంచి కేరళ స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్‌ను తప్పించడంపై సీనియర్ క్రికెటర్ అజింక్యా రహానే తీవ్ర ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టైటిల్‌ను భారత్ గెలవడంలో కీలక పాత్ర పోషించిన సంజూ శాంసన్‌ను ఇలా జట్టు నుంచి సడన్‌గా పక్కనపెట్టడం వింతగా ఉందని అతను అభిప్రాయపడ్డాడు. ఈ మేరకు రహానే తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో మేనేజ్‌మెంట్, సెలెక్టర్ల తీరును తప్పుబడుతూ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశాడు.


**ఆటగాళ్లతో సెలెక్టర్లు మాట్లాడాలి: రహానే**

"జట్టు నుంచి తప్పించే విషయంపై సెలెక్టర్లు సంజూ శాంసన్‌తో ముందుగా చర్చించి ఉంటారని, అతనికి సరైన సమాచారం ఇచ్చి ఉంటారని ఆశిస్తున్నాను. టీ20 ప్రపంచకప్ విజయంలో కీలక పాత్ర పోషించిన హీరోని, రాబోయే జింబాబ్వే పర్యటనకు దూరం పెట్టడం నాకు చాలా వింతగా అనిపించింది. త్వరలోనే అతను మళ్లీ జట్టులోకి పునరాగమనం చేస్తాడని ఆశిస్తున్నాను" అని రహానే తన ఇన్‌స్టా స్టోరీలో పేర్కొన్నాడు. భవిష్యత్తులోనైనా ఆటగాళ్లకు, సెలెక్షన్ కమిటీకి మధ్య స్పష్టమైన కమ్యూనికేషన్ ఉండాలని ఈ సందర్భంగా రహానే సూచించాడు.

**స్క్వాడ్‌లో ఆరు భారీ మార్పులు.. యువ ఆటగాళ్లకు ఛాన్స్**

జూలై 23, 25, 26 తేదీల్లో హరారే వేదికగా జింబాబ్వేతో జరగబోయే మూడు టీ20ల సిరీస్ కోసం భారత సెలెక్షన్ కమిటీ మంగళవారం 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఇంగ్లండ్‌తో తలపడుతున్న జట్టుతో పోలిస్తే ఈ సిరీస్‌కు సెలెక్టర్లు ఏకంగా ఆరు మార్పులు చేశారు. సంజూ శాంసన్‌తో పాటు అర్షదీప్ సింగ్, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, ప్రసిధ్ కృష్ణలపై ఉద్వాసన వేటు పడగా, స్టార్ బ్యాటర్ రజత్ పాటిదార్‌కు కూడా ఈ జట్టులో చోటు దక్కలేదు. మరోవైపు ఐపీఎల్, దేశవాళీల్లో మెరిసిన రింకూ సింగ్, హర్ష్ దూబే, అశోక్ శర్మ, యశ్ ఠాకూర్, మయాంక్ యాదవ్, ప్రభ్ సిమ్రాన్ సింగ్‌లు సరికొత్తగా భారత జట్టులోకి వచ్చారు. వరల్డ్‌కప్ గెలిచిన కొద్దిరోజులకే కీలక ఆటగాళ్లపై ఇలా వేటు పడటం ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది.

# ఓటీటీలో 'పెద్ది'..





ఈ ఏడాది టాలీవుడ్ అందుకున్న సాలిడ్ హిట్ చిత్రాల్లో మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామా చిత్రం "పెద్ది" కూడా ఒకటి. మంచి హైప్ నడుమ వచ్చి రికార్డు ఓపెనింగ్స్ అందుకొని 400 కోట్లకి పైగా వసూళ్లు అందుకుంది.అంతే కాకుండా 30 రోజులు దాటిన తర్వాత కూడా పలు చోట్ల హౌస్ ఫుల్స్ ఈ సినిమాకి పడ్డాయి. ఇక ఫైనల్ గా ఓటిటి రిలీజ్ కి సిద్ధం అయ్యింది. దిగ్గజ స్ట్రీమింగ్ సంస్థ నెట్ ఫ్లిక్స్ ఈ సినిమాని జూలై 9 నుంచి హిందీ మినహా మిగతా భాషల్లో స్ట్రీమింగ్ కి రాబోతుంది. అయితే ఈ సినిమా విషయంలో ఒక్క క్లారిటీ ఓటిటి వెర్షన్ విషయంలో అభిమానులు కోరుకుంటున్నారు. థియేటర్స్ లో విడుదల చేసిన తర్వాత పెద్ది సినిమాపై కొన్ని అంశాల్లో వచ్చిన విమర్శలు తీసుకొని కొన్ని సీన్స్ తీసేసి మేకర్స్ కొత్త సీన్స్ యాడ్ చేశారు. అయితే ఈ వెర్షన్ ఉంటుందా లేక మొదట్లో వచ్చిందే వస్తుందా అనేది మేకర్స్ కానీ అటు నెట్ ఫ్లిక్స్ కానీ ఎలాంటి క్లారిటీ ఇవ్వకపోవడం కొంచెం ఫ్యాన్స్ లో కన్ఫ్యూజన్ గా మారింది. సో దీనిపై వారు ఓ క్లారిటీ కోరుకుంటున్నారు. చరణ్ నటించిన గత సినిమా గేమ్ ఛేంజర్ కూడా ఇలాంటి పరిస్థితే చూసింది. థియేటర్స్ లో మొదట వచ్చినా వెర్షన్ ని తర్వాత కొన్ని సీన్స్ తీసేసి నానా హైరానా సాంగ్ పెట్టి కుదించేశారు. తీరా ఓటిటిలోకి వచ్చాక ఆ ముందు సీన్స్ ఏవి కూడా అందులో లేవు. సో పెద్ది సినిమాకి కూడా ఇలానే జరుగుతుందా లేదా అనేది ఈ జూలై 9తో తేలిపోతుంది.

# సెంచరీకి దగ్గర్లో సమంత..









తెలుగు సినిమా బాక్సాఫీస్ దగ్గర పూర్తిగా హీరోలదే డామినేషనా అంటే అందుకు లేదనే సమాధానం తరాల నుంచి ఉంది. అలా ఇప్పుడు ట్రెండీ సమయంలో కూడా పలువురు హీరోయిన్స్ తమదైన మార్కెట్ ని టాలీవుడ్ లో ఏర్పరచుకొని భారీ నంబర్స్ బాక్సాఫీస్ దగ్గర సెట్ చేస్తున్నారు.అయితే ఈ లిస్ట్ లో అనుష్క, సమంత ఇంకొందరు బ్యూటీస్ ఉన్నారు. వీరిలో సమంత మాత్రం ఊహించని రికార్డులు టాలీవుడ్ దగ్గర సెట్ చేసింది. ఆమె నటించిన సెన్సేషనల్ హిట్ "మా ఇంటి బంగారం" సినిమా ఇప్పుడు ఏకంగా 100 కోట్ల గ్రాస్ కి దగ్గరలో వస్తుంది.మొత్తం 18 రోజుల రన్ ని కంప్లీట్ చేసుకున్న ఈ సినిమా ఇపుడు 96 కోట్ల గ్రాస్ కి చేరుకుంది. దీనితో 100 కోట్ల మార్క్ కి సినిమా దాదాపు చేరుకునే ఛాన్స్ లేకపోలేదని చెప్పొచ్చు. ఇన్ని రోజులు అయినా కొత్త సినిమాలకి ధీటుగా మా ఇంటి బంగారం నిలిచింది. సో లాంగ్ రన్ లో 100 కోట్ల మార్క్ టచ్ చేసే ఛాన్స్ ఉంది.


'అరుంధతి', 'మహానటి' రికార్డులు బద్దలు..

టాలీవుడ్ సినిమా దగ్గర ఫీమేల్ ఓరియెంటెడ్ సినిమాల్లో స్వీటీ అనుష్క శెట్టి నటించిన సెన్సేషనల్ హారర్ హిట్ చిత్రం 'అరుంధతి' 2009 లోనే 70 కోట్లకి పైగా గ్రాస్ రాబట్టి సంచలనం నమోదు చేసింది. అక్కడ నుంచి మళ్ళీ 2018లో కీర్తి సురేష్ నటించిన మహానటి 80 కోట్లకి పైగా గ్రాస్ రాబట్టి బిగ్గెస్ట్ హిట్ గా నిలిచింది. కాకపోతే ఈ సినిమా తెలుగు, తమిళ్ రెండు భాషల్లోని తెరకెక్కి రిలీజ్ అయ్యింది. అయినప్పటికీ సమంత మా ఇంటి బంగారం సినిమా మాత్రం ఈ రెండు సినిమాలని క్రాస్ చేసి 97 కోట్ల దగ్గర గ్రాస్ కి చేరుకుంది.

100 కోట్లతో టాలీవుడ్ లో మొదటి హీరోయిన్‌గా సామ్ ఖాతా తెరుస్తుందా?

ఇప్పుడు బాక్సాఫీస్ లెక్కలు చాలా సాధారణం అయ్యిపోయాయి. కానీ ఒకప్పుడు గ్రాస్ కి ఒక క్లబ్ అని షేర్ కి ఒక క్లబ్ అని హీరోల ని ఆయా కోణాల్లో ఫ్యాన్స్ డివైడ్ చేసుకున్నారు. కానీ ఫైనల్ ఈ ట్రెండ్ హీరోయిన్స్ కి వచ్చేసరికి సమంత 100 కోట్ల క్లబ్ ని టాలీవుడ్ కి హీరోయిన్స్ వెర్షన్ లో పరిచయం చేసే అవకాశం కనిపిస్తుంది. మరి ఈ మార్క్ ని అందుకుంటే టాలీవుడ్ లో మొదటి 100 కోట్ల గ్రాస్ ఉన్న హీరోయిన్ గా చరిత్ర సృష్టించినట్టే అని చెప్పాలి. ఇప్పుడు సినిమా దాదాపు రన్ పూర్తి చేసుకోవస్తుంది. సో చూడాలి మా ఇంటి బంగారం ఆ మార్క్ కొడుతుందో లేదో అనేది.

# 'టాక్సిక్' చూసి షేక్ అవ్వాల్సిందే అంటున్న బాలీవుడ్ బ్యూటీ..!



కన్నడ రాక్‌స్టార్ యష్ నటిస్తున్న ది మోస్ట్ అవైటెడ్ చిత్రం 'టాక్సిక్' కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా చూస్తున్నారు. గీతూ మోహన్‌దాస్ డైరెక్ట్ చేసిన ఈ సినిమాను పూర్తి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందించారు. ఈ సినిమాతో యష్ మరోసారి ఇండియన్ బాక్సాఫీస్ దగ్గర సెన్సేషన్ క్రియేట్ చేయడం ఖాయమని ఈ మూవీ ప్రమోషనల్ కంటెంట్ చూస్తే అర్థమవుతుంది. ఇక ఈ సినిమాపై మరింత హైప్ ఎక్కించింది బాలీవుడ్ భామ హుమా ఖురేషీ.'టాక్సిక్' సినిమాలో కీలక పాత్రలో హుమా నటిస్తున్న సంగతి తెలిసిందే. అయితే, ఆమె రీసెంట్‌గా ఈ మూవీపై కొన్ని ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. ఈ సినిమాలో చాలా మంది లేడీ స్టార్స్ నటిస్తున్నారని.. అంతమంది నటిస్తున్నారంటే ఈ సినిమాలో ఏదో మ్యాటర్ ఉంటుందిగా.. అదేంటో తెలియాలంటే ఇంకా కొద్ది రోజులు వెయిట్ చేయాలి. ఇక ఈ సినిమా ఇండియన్ బాక్సాఫీస్‌ను షేక్ చేయడం ఖాయమని ఆమె పేర్కొంది.ఈ సినిమాలో హీరోయిన్స్ అందరూ సూపర్బ్‌గా నటించారని.. అందరికీ మంచి పేరు రావడం ఖాయమని ఆమె తెలిపింది. మొత్తానికి టాక్సిక్ చిత్రంపై మరోసారి అంచనాలు పెంచేసింది ఈ బాలీవుడ్ బ్యూటీ.

# రామ్ పోతినేని ప్రాజెక్ట్‌లోకి ఎంట్రీ ఇచ్చిన మ్యూజిక్ డైరెక్టర్..



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా నటిస్తూ తొలిసారి తానే డైరెక్ట్ చేస్తున్న లేటెస్ట్ యాక్షన్ చిత్రం ఇటీవల అధికారికంగా ప్రారంభమైంది. ఈ చిత్రాన్ని 'చ=ర్యారా23' అనే ట్యాగ్‌తో తెరకెక్కిస్తున్నారు. ఇక ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ తాజాగా ఓ సాలిడ్ అప్డేట్ ఇచ్చారు. ఈ చిత్రానికి సంగీతం ఎవరు అందిస్తున్నారనే విషయాన్ని చిత్ర యూనిట్ రివీల్ చేసింది.ఈ సినిమాకు ప్రముఖ సంగీత దర్శకుడు సామ్ సిఎస్ సంగీతం అందించబోతున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటిస్తూ ఒక స్పెషల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. 'ప్రతి ప్రపంచానికి ఒక శబ్దం ఉంటుంది.. ఈ ప్రపంచం విధ్వంసాన్ని శ్వాసిస్తోంది' అంటూ సామ్ సిఎస్ ఎంట్రీని చిత్ర యూనిట్ ఘనంగా స్వాగతించింది. రామ్ పోతినేని నటిస్తున్న ఈ ఇంటెన్స్ యాక్షన్ డ్రామాకు ఆయన అందించబోయే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు హైలైట్‌గా నిలవనుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.ఇక ఈ చిత్రాన్ని రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై కృష్ణ పోతినేని నిర్మిస్తుండగా తిరు సినిమాటో గ్రాఫర్‌గా, పీటర్ హెయిన్ యాక్షన్ కొరియోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు.

# 'సత్లుజ్' చుట్టూ రాజుకుంటున్న వివాదం




'సత్లుజ్' మూవీని ఓటీటీ నుంచి తొలగించడం రాజకీయ దుమారం రేపుతోంది. జీ 5 ఓటీటీలో రెండు రోజులక్రితమే విడుదలైన 'సత్లుజ్'ను తొలగించాలని తాజాగా జీ5 సంస్థను కేంద్రం ఆదేశించింది. దీంతో ఈ చిత్రాన్ని తమ ఓటీటీ నుంచి జీ5 తొలగించింది. అయితే, కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ చిత్రాన్ని ఓటీటీ నుంచి తొలగించడాన్ని అకాల్ తఖ్త్ ఖండించింది. అకాల్ తఖ్త్ జతేదార్ గియాని కుల్దీప్ సింగ్ గర్గాజ్ ఈ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు. తీవ్రవాదంపై పోరు సందర్భంగా అమాయకపు యువతను ఎలా ఇబ్బంది పెట్టారనే విషయాన్ని దేశ ప్రజలు తెలుసుకుంటారని, అందువల్ల కేంద్రం ఈ కంటెంట్‌ను అనుమతించాలని ఆయన కోరారు.ఈ చిత్రాన్ని ఇండియా అంతా ప్రదర్శించాలని ఆయన కోరారు. భావ ప్రకటనా స్వేచ్ఛను, మానవ హక్కులను ఉల్లంఘించేలా ఈ చిత్రాన్ని తొలగించడం సరికాదన్నారు. ఈ అంశంపై బీజేపీ పంజాబ్ అధ్యక్షుడు కేవల్ సింగ్ ధిల్లాన్ కూడా స్పందించారు. ఈ అంశంపై తాను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో మాట్లాడినట్లు తెలిపారు. దీనిపై ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశామని తనకు కేంద్ర మంత్రి అశ్విని చెప్పారని, ఈ త్రిసభ్య కమిటీ సమీక్ష జరిపిన ఇచ్చిన నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు కేవల్ సింగ్ తెలిపారు. పంజాబ్ ప్రజల భావోద్వేగాలకు బీజేపీ కట్టుబడి ఉంటుందన్నారు. ఈ చిత్రాన్ని ఓటీటీ నుంచి తొలగిండచడంపై పంజాబ్‌లోని ఆమ్ ఆద్మీ పార్టీ స్పందించింది. కేంద్ర నిర్ణయం పంజాబ్‌పై వివక్ష చూపడమే అని ఆ పార్టీ విమర్శించింది.ద కాశ్మీర్ ఫైల్స్ సినిమాలాగే ఈ చిత్రాన్ని కూడా అందుబాటులో ఉంచాలని ఆమ్ ఆద్మీ పార్టీ కేంద్రాన్ని కోరింది. పంజాబ్ సింగర్ దిల్జిత్ దోసాంజె మెయిన్ లీడ్‌గా నటించిన 'సత్లుజ్' మూవీ ఓటీటీలో విడుదల కాగా.. కేంద్రం తొలగించింది. ఐటీ రూల్స్ 2021 ప్రకారం నిబంధనలు ఉల్లంఘించినందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని కేంద్రం తెలిపింది. అయితే, పంజాబ్‌లోని పలు రాజకీయ పార్టీలు, శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ కూడా ఈ సినిమాను అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేస్తున్నాయి.

# బ్యాక్‌గ్రౌండ్ ఉన్నా టాలెంట్ లేకపోతే కష్టం..



టాలీవుడ్‌లో నెపోటిజం (వారసత్వం) అంశంపై ఎప్పుడూ ఏదో ఒక చర్చ నడుస్తూనే ఉంటుంది. తాజాగా ప్రముఖ నిర్మాణ సంస్థ 'మైత్రీ మూవీ మేకర్స్' అధినేతల్లో ఒకరైన వై. రవిశంకర్ ఈ విషయంపై చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.ఇటీవల జరిగిన 'రాజా ది రాజా' (=ఖయిఖ ఐఅ =ఖయిఖ) చిత్ర టీజర్ లాంచ్ ఈవెంట్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్ర హీరో రిత్విక్‌ను ఉద్దేశించి వేదికపై రవిశంకర్ మాట్లాడుతూ.. సినిమా పరిశ్రమలో రాణించాలంటే బ్యాక్‌గ్రౌండ్ కంటే సొంత ప్రతిభే ముఖ్యమని స్పష్టం చేశారు. సినీ పరిశ్రమలోకి ఎవరైనా గోల్డెన్ స్పూన్ లేదా డైమండ్ స్పూన్‌తో పుట్టి రావచ్చు కానీ ఇక్కడ అవేమీ పని చేయవని, మిమ్మల్ని నిలబెట్టేది కేవలం మీలో ఉన్న ప్రతిభ మాత్రమేనని ఆయన నొక్కి చెప్పారు. మన వెనుక ఎవరి అండా లేదని భావించి కష్టపడి ముందుకు సాగినప్పుడే నిజమైన విజయం దక్కుతుందంటూ హీరో రిత్విక్‌ను ప్రోత్సహిస్తూ ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రవిశంకర్ చేసిన ఈ కామెంట్స్ సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. నరేష్, వైశాఖ ధీమన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి మార్క్ కె రాబిన్ సంగీతం అందిస్తున్నారు.

# 'రామాయణ' ట్రైలర్‌కు డేట్ ఫిక్స్..




బాలీవుడ్‌లో తెరకెక్కుతున్న ది ప్రెస్టీజియస్ మైథలాజికల్ చిత్రం 'రామాయణ' యావత్ దేశవ్యాప్తంగా ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నమిత్ తివారీ తెరకెక్కిస్తున్న ఈ భారీ చిత్రంలో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీత పాత్రలో సాయి పల్లవి నటిస్తున్నారు. దీంతో ఈ సినిమాపై అంచనాలు భారీగా ఏర్పడ్డాయి.అయితే, ఈ సినిమాను దీపావళి 2026 కానుకగా రిలీజ్ చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ చిత్రానికి సంబంధించిన థియేట్రికల్ ట్రైలర్‌ను జూలై 18న రిలీజ్ చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సినిమాకాన్ ఫెస్టివల్‌లో ఈ ట్రైలర్‌ను ప్రదర్శించారు. దీంతో ఇప్పుడు ఈ ట్రైలర్‌ను అధికారికంగా రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ రెడీ అవుతోందట.కాగా, ఈ సినిమాలో రావణుడి పాత్రలో యష్, లక్ష్మణుడి పాత్రలో రవి దూబే నటిస్తుండగా నమిత్ మల్హోత్రా ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఈ చిత్ర రెండవ భాగాన్ని 2027 దీపావళి కానుకగా రిలీజ్ చేయాలని మేకర్స్ రెడీ అవుతున్నారు.